
షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక




సంపుటి : 1 సంచిక : 250 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 22 జూలై 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 249 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 22 july 2024 PAGES : 8 PRICE : 5/-

## ఏపీకి ప్రత్యేక హోదా
# ఇవ్వాల్సిందే

- అఖిలపక్ష భేటీలో వైఎస్సార్‌సీపీ డిమాండ్
- టీడీపీ మాత్రం మౌనంగా ఉంది
- బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని జేడీయూ డిమాండ్ చేసింది
- 45 రోజుల్లో 39 హత్యలు, 300 మందిపై హత్యాయత్నాలు జరిగాయి
- బ్లాక్ మెయిల్ చేసే మీడియాను అడ్డుకునే చట్టం తీసుకురావాలి
- రాష్ట్రానికి సంబంధించిన పలు సమస్యలను ప్రస్తావించినట్టు వెల్లడి
- కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేసిన వైసీపీ ఎంపీ



**ఢిల్లీ**

పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో న్యూఢిల్లీలో నేడు జరిగిన అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి.. భేటీ అనంతరం ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా హామీకి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తాను ఆశిస్తున్నానని అన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వకపోతే ఎన్డీయే నుంచి టీడీపీ కచ్చితంగా వైదొలగుతుందని - మిగతా3లో




# ఇంకెన్నాళ్లిలా?

## ఏపీలో ప్రభుత్వం మారినా ఇంకా ఇదేం పద్ధతి..?

-3లో

*ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో ఊహించని రీతిలో కూటమి ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రభుత్వం మారి 45 రోజులు దాటింది కూడా..! అయినా సరే ఇంకా పాత వాసనలు పోలేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి..! ఎందుకంటే.. సీఎం నారా చంద్రబాబు సంతకం పెట్టడం, కేబినెట్ కూడా ఆమోదించినప్పటికీ ఇంతవరకూ యూనిర్శిటీ పేరు మారకపోవడం గమనార్హం. దీంతో అసలు ఏం జరుగుతోంది..? ఇదంతా పనిగట్టుకునే చేస్తున్నారా..? లేకుంటే మరో కారణం ఏమైనా ఉందా అనే అనుమానాలు కలుగుతున్న పరిస్థితి.*

## మోదీ మాట్లాడేటప్పుడు
# సభలో అడ్డుపడకండి



- అఖిలపక్షంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- సభ్యులంతా ప్రజాసామ్య పరిపుష్టతకు కృషి చేయాలి
- సభా కార్యక్రమాల్లో జోక్యం చేసుకోవడం కానీ, అంతరాయం కలిగించడం కానీ చేయరాదు
- వర్షాకాల సమావేశాలు సజావుగా సాగేందుకు మంచి సూచనలు చేసిన అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు కృతజ్ఞతలు
- సభలను సజావుగా నడిపే బాధ్యత ఇటు ప్రభుత్వంతో పాటు అటు విపక్షాలకు కూడా ఉంటుంది

## 36 హత్యల వివరాలు
# జగన్ ఇవ్వగలరా?

- ఏపీ ప్రభుత్వాన్ని ఎవరైనా టార్గెట్ చేసి ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- రాజకీయ హత్యల వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి జగన్ ఇవ్వాలి
- లేకుంటే ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం
- బాబూ పులివెందుల ఎమ్మెల్యే... గతంలో ఏం చేశావో గుర్తుచేసుకోవయ్యా!
- జగన్‌కు పాత బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఇచ్చారంటున్న వైసీపీ
- గతంలో చంద్రబాబుకు ఇచ్చిన కారును ఇప్పుడు జగన్‌కు ఇచ్చామన్న అనిత
- జగన్ పులివెందుల ఎమ్మెల్యే మాత్రమేనని వెల్లడి
- నీలోని మహానటుడు జనాలకు కనిపించడనే వేరే కారు ఎక్కావంటూ ఫైర్
- హోంమంత్రి వంగలపూడి అనిత



**అమరావతి:**

జగన్‌కు పాత బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఇచ్చారని, చంద్రబాబు పదేళ్ల పాటు వాడిన వాహనాన్ని కనీసం మరమ్మతులు కూడా చేయించకుండా జగన్ కు కేటాయించారని వైసీపీ చేసిన ఆరోపణలపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. బాబూ పులివెందుల ఎమ్మెల్యే... నువ్వు ఇంతకుముందు ఓసారి ఏం చేశావో గుర్తుకు తెచ్చుకోవయ్యా... అంటూ ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 36రాజకీయ హత్యలు జరిగాయని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా మండిపడ్డారు. నూతన ప్రభుత్వంపై - మిగతా3లో




## మోదీ సర్కార్‌పై జనాగ్రహం తప్పదు

- కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే విమర్శలు
- ప్రభుత్వం రైలు ప్రమాదాలను నివారించే దిశగా చర్యలు చేపట్టకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు
- రైల్వే శాఖ బలహీనపడటంతోనే రైలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి
- రైల్వేలు నీరుగారడంతోనే రైలు ప్రమాదాలు ఒకదాని వెంట ఒకటి జరుగుతున్నాయి
- రైల్వేలకు సకాలంలో నిధులు ఇవ్వడం లేదు

## ఖరీఫ్ సీజన్‌కు
# సంసిద్ధం కావాలి

- ఖరీఫ్ సీజన్ కోసం 17.50లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం
- ఇప్పటికే ప్రారంభ నిల్వలతో కలిపి 14లక్షల టన్నులు రాష్ట్రానికి
- రాష్ట్రవ్యాప్తంగా 1,321సహకార సంఘాల్లో రైతులకు విక్రయించేందుకు ఎరువులు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడి
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ సీజన్‌కు పూర్తిస్థాయిలో సంసిద్ధం కావాలని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఖరీఫ్ సీజన్ కోసం 17.50లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం చేయాలని వ్యవసాయశాఖ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ప్రారంభ నిల్వలతో కలిపి 14లక్షల టన్నులు రాష్ట్రానికి చేరుకున్నట్లు ఆయన వెల్లడించారు. మిగిలిన ఎరువులు సకాలంలో రైతులకు అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,321సహకార సంఘాల్లో - మిగతా3లో

# 36 హత్యల వివరాలు జగన్ ఇవ్వగలరా?

-మొదటిపేజీ తరువాయి

తప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్‌పై చర్యలు తీసుకుంటామని అనిత హెచ్చరించారు. 36హత్యలు జరిగాయని జగన్ చెప్తున్నారు, వాటి వివరాలు ఆయన ఇవ్వగలరా? అంటూ ఆమె సవాల్ విసిరారు. రాజకీయ హత్యల వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి జగన్ ఇవ్వాలని, లేకుంటే ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

**దమ్ముంటే అసెంబ్లీకి జగన్ రావాలి..**

ఏపీ ప్రభుత్వాన్ని ఎవరైనా టార్గెట్ చేసి ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత హెచ్చరించారు. మైకు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్టు ఆరోపణలు చేస్తే చట్టం ఎందుకు ఊరుకోవాలని ఆమె ప్రశ్నించారు. రాజకీయ హత్యలు జరిగాయంటూ నోటికొచ్చిన నంబర్ చెప్పేస్తే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. అసెంబ్లీకి రాకుండా తప్పించుకునేందుకే ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని ఢిల్లీలో జగన్ ధర్నా చేయబోతున్నట్లు ఆమె చెప్పుకొచ్చారు. ఆయనకు దమ్ముంటే అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. అసెంబ్లీలో శాంతి భద్రతలపై మేము ప్రవేశపెట్టే శ్వేతపత్రంపై జగన్ చర్చించగలరా?, తప్పుడు ప్రచారం చేయడం ఆయనకు అలవాటుగా మారిందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు ఇంకా తన మాట నమ్ముతారనే భ్రమలో ఆయన ఉన్నారని హోంమంత్రి అనిత ఎద్దేవా చేశారు.

**ఇదీ మీ చరిత్ర..!**

వైసీపీ హయాంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటిపై మాజీ మంత్రి జోగి రమేశ్ దాడి చేశారని, జై జగన్ అని అనలేదని చంద్రయ్య అనే టీడీపీ కార్యకర్తను దారుణంగా పీక కోసి చంపేశారని ఆమె గుర్తు చేశారు. రోడ్డు మీద పరదాలు



కట్టడానికి, చెట్లు నరకడానికి, టీడీపీ నేతలను వేధించడం కోసం మాత్రమే పోలీసులను జగన్ వాడుకున్నారు. నెల రోజుల కాలంలో మేం ఎక్కడన్నా వైసీపీ నేతలను హౌస్ అరెస్టులు చేశామా?. అడుగడుగునా అడ్డుకున్న వైసీపీది ఆటవిక పాలనా లేక యథేచ్ఛగా రోడ్డు మీద తిరుగుతున్నా జగన్‌ను అడ్డుకోని మాదా ఆటవిక పాలన? అంటూ ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో దిశా పోలీస్ స్టేషన్ ప్రారంభించిన సాయంత్రమే గ్యాంగ్ రేప్ జరిగింది. నేరాలు, హత్యలు, అత్యాచారాలపై సీఎంగా ఉన్నప్పుడు ఒక్కసారైనా స్పందించారా?. లా అండ్ ఆర్డర్, గంజాయిపై ఒక్కసారైనా సమీక్ష జరిపారా అంటూ అనిత ప్రశ్నల వర్షం కురిపించారు.

**వివేకా హత్యపై మాట్లాడగలరా?**

వినుకొండలో రషీద్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన జగన్ రాజకీయాలు మాట్లాడారే తప్ప కనీసం బాధిత కుటుంబానికి ఒక్క రూపాయి కూడా అందజేయలేదని హోంమంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన సంపాదించిన అక్రమ ఆస్తిలో నుంచి డబ్బులు ఇవ్వలేకపోయిన జగన్‌కు బాధిత కుటుంబంపై ప్రేమ ఉందంటే ఎవరు నమ్ముతారంటూ ఆమె ప్రశ్నించారు. సీఎంగా ఆయన పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారు. అమరావతిలో ఉన్న పాపానికి ఫోరెన్సిక్ ల్యాబ్ నిర్మాణానికి గత ప్రభుత్వం డబ్బులు కూడా ఇవ్వలేదు. ఢిల్లీలో జగన్ కూర్చొని వివేకా హత్య గురించి చెప్పగలరా?. చంద్రబాబుపై రాళ్లు వేసి భావ ప్రకటన స్వేచ్ఛ అని కామెంట్లు చేసిన వైసీపీ నేతలా మమ్మల్ని విమర్శిస్తోందని ఆమె దుయ్యబట్టారు. గతంలో ఏం జరిగిందో గుర్తు చేసుకో పులివెందుల ఎమ్మెల్యే అంటూ ఆమె వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

**ఐదేళ్లపాటు రాజారెడ్డి రాజ్యాంగం!**

ఏపీలో గత ఐదేళ్లలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేశారని హోంమంత్రి ధ్వజమెత్తారు. వైసీపీ నేతలు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, విజయసాయి రెడ్డి అంశాన్ని పక్కకు పెట్టేందుకే రాష్ట్రంలో ఆందోళనకర పరిస్థితులు ఉన్నాయంటూ జగన్ హడివిడి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం మీద కావాలనే నిందలు వేస్తున్నారు. రాజకీయ హత్యలు కేవలం 4మాత్రమే జరిగాయని, బాధితుల్లో ముగ్గురు టీడీపీ నాయకులే ఉన్నట్లు ఆమె చెప్పుకొచ్చారు. అధికారం కోల్పోయిన నెల రోజుల్లోనే జగన్‌కు అధికార కాంక్ష పట్టుకుంది. చంపుకోవడం తప్పు దాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. సీఎం కుర్చీలో కూర్చోవడం కోసం బాబాయి హత్య, కోడికత్తి డ్రామా నడిపారు. ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తే జగన్‌పై కూడా కేసులు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు. జగన్ అకృత్యాలపై మేము కూడా ఢిల్లీలో మాట్లాడతాం. వినుకొండ ఘటనపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై కేసు నమోదు చేస్తామని హోం మంత్రి అనిత హెచ్చరించారు.

# ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే..

-మొదటిపేజీ తరువాయి

భావిస్తున్నట్టు ఆయన వ్యాఖ్యానించారు. పార్లమెంట్ వర్షాకాల బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో వైఎస్సార్‌సీపీ తరపున ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి హాజరయ్యారు. ఏపీలో క్షీణించిన శాంతి భద్రతల పరిస్థితులను వైఎస్సార్‌సీపీ వివరించింది. ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని కోరింది. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని అఖిలపక్ష సమావేశంలో వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేయగా, టీడీపీ మాత్రం మౌనంగా ఉంది. బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని జేడీయూ డిమాండ్ చేసింది.

**ఢిల్లీ వేదికగా టీడీపీ దాడులను ఎండగడతాం: విజయసాయిరెడ్డి**

అఖిల పక్ష భేటీ అనంతరం ఎంపీ విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఏపీలో 45 రోజుల్లో 39 హత్యలు, 300 మందిపై హత్యాయత్నాలు జరిగాయని.. ఢిల్లీ వేదికగా టీడీపీ దాడులను ఎండగడతామన్నారు. ఢిల్లీలో బుధవారం వైఎస్ జగన్ నేతృత్వంలో ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. బ్లాక్ మెయిల్ చేసే మీడియాను అడ్డుకునే చట్టం తీసుకురావాలని విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు. కాగా, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు రేపటి(సోమవారం) నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో నిన్న (శనివారం) ఆయన తాడేపల్లిలోని క్యాంప్ ఆఫీసులో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ఎంపీలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసాలు



సృష్టిస్తూ చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న దారుణకాండను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్లేందుకు ఢిల్లీలో ఈ నెల 24వ తేదీ బుధవారం నిర్వహించే ధర్నాకు అన్ని పార్టీలను ఆహ్వానిస్తున్నామని వైఎస్ జగన్ చెప్పారు. గత 45 రోజులుగా రాష్ట్రంలో ఏం జరుగుతోందో వివరించి.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటంలో కలిసి వచ్చే అన్ని పార్టీలనూ కలుపుకుపోదామని ఎంపీలకు సూచించారు. ధర్నా అనంతరం పార్లమెంట్‌కు హాజరై రాష్ట్రంలో సాగుతున్న ఆటవిక పాలనపై గళమెత్తాలని దిశా నిర్దేశం చేశారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కక్షతో చేస్తున్న దురాగతాలను తమ సభల్లోని సభ్యులందరి దృష్టికి తీసుకెళ్లాలని ఉద్భోధించారు.

# ఏపీ సెక్రటేరియెట్‌లో కోవర్టుల కలకలం

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో కొంత మంది ఉద్యోగులు ఉద్దేశపూర్వకంగా బిజినెస్ రూల్స్ ఉల్లంఘిస్తూ ప్రభుత్వ అనుమతి లేకుండా పాత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల జీవోలు, గెజిట్స్ విడుదల చేయడం వెనుక భారీ కుట్ర ఉందని అనుమానిస్తున్నారు. ఇప్పటికీ గత ప్రభుత్వంలో తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలు అమలవుతున్నాయి. వాటిని నిలిపి వేయాల్సి ఉన్నా పట్టించుకోవడ లేదు. వీటన్నింటిపై సమగ్ర పరిశీలన జరిపి.. బాధ్యులెవరో గుర్తించాలని ఏపీ సీఎంవో అధికారులు నిర్ణయించారు. ఇందు కోసం అంతర్గత విచారణ ప్రారంభించినట్లుగా తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు సీపీఎస్ ఉద్యోగులకు ప్రత్యామ్నాయంగా జీపీఎస్ అనే విధానాన్ని తీసుకు వస్తామని ప్రకటించింది. దానికి ఉద్యోగ సంఘాల నేతలు ఆమోదం తెలిపారు. కానీ మెజారిటీ ఉద్యోగులు వ్యతిరేకంగా ఉన్నారు. గత ప్రభుత్వంలో నిర్ణయం తీసుకున్నారు కానీ జీవో, గెజిట్ జారీ కాలేదు. కానీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణం స్వీకారం చేస్తున్న రోజే జీవో జారీ అయింది. హడావుడిలో ఎవరూ పట్టించుకోలేదు. ఎవరూ పట్టించుకోలేదని నెల తర్వాత గెజిట్ జారీ చేసేశారు. దీంతో ఒక్క సారిగా కలకలం రేగింది. ఉద్యోగ సంఘాలు జీపీఎస్ అక్కర్లేదని ప్రకటనలు ప్రారంభించాయి. అసలు జీపీఎస్ విధానం అమలు చేయడంపై ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వం మారినప్పుడు గత ప్రభుత్వం తీసుకున్న




నిర్ణయాలకు సంబంధించిన జీవోలను విడుదల చేయాలంటే ఖచ్చితంగా కొత్త ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. బిజినెస్ రూల్స్ స్పష్టంగా ఈ విషయాన్ని చెబుతున్నాయి. కానీ జీపీఎస్ విషయంలో అధికారులు ఎలాంటి అనుమతి తీసుకోలేదు. ఉద్దేశపూర్వకంగానే జీవో జారీ చేశారని వెల్లడయింది. ఆర్థిక శాఖలో పని చేసే శాంతి కుమారి, లా డిపార్టుమెంట్‌లో హరిప్రసాద్ రెడ్డి అనే ఉద్యోగులు ఇందులో కీలకంగా వ్యవహరించారని గుర్తించారు. వీరిద్దరూ సచివాలయ ఉద్యోగుల సంఘం నేత వెంకట్రామిరెడ్డికి సన్నిహితులు. ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ ఎన్నికల ప్రచారం చేసినందుకు ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. ప్రస్తుతం సస్పెన్షన్ లో ఉన్నారు. ఆయన తనకు అనకూలమైన ఉద్యోగుల ద్వారా ప్రభుత్వ నిర్ణయాల కానీ.. గత ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాల జీవోలను జారీ చేయిస్తున్నారని అనుమానిస్తున్నారు. సీఎం చంద్రబాబునాయుడు పేషీ దీనిపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించింది. అలాంటి జీవోలు ఏమి ఉన్నా సరే.. తమ అనుమతి తీసుకోవాలని ఆదేశించింది జీపీఎస్ జీవో, గెజిట్‌లను ఆపేసింది. ఇలాంటి కోవర్టు పనులు చేసే ఉద్యోగులను గుర్తించేందుకు సీఎంవో ప్రత్యేకమైన విచారణ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. కొంత మందిపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఇంకెన్నాళ్లిలా?

వైసీపీ హయాంలో మారిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ పేరును.. కూటమి అధికారంలోకి రాగానే ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌గా మార్చింది. ఇందుకు సీఎం నారా చంద్రబాబుతో పాటు కేబినెట్ ఆమోదం కూడా లభించింది. అయినా ఇంకా ప్రభుత్వ ప్రకటనల్లో మాత్రం పేరు మారలేదు. ఆదివారం నాడు ఓ దిన పత్రికలో డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఎండీఎస్ మేనేజ్మెంట్ కోటా, కాంపిటేట్ అథారిటీ కోటా పేరుతో అడ్మిషన్స్‌కు పత్రిక ప్రకటన ఇవ్వడం జరిగింది. ఈ ప్రకటనను యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి. రాధికా రెడ్డి రిలీజ్ చేశారు. అయితే.. యూనివర్శిటి పేరు మారిందన్న విషయం రిజిస్ట్రార్ మరిచిపోయారో లేకుంటే ఇంకేం జరిగిందో తెలియట్లేదు కానీ.. ప్రకటన అలాగే ఇవ్వడంతో పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. మారని అధికారుల తీరుపై.. ఇష్టానుసారం ప్రకటనలు ఇవ్వడంతో ఉన్నతాధికారులు క్లాస్ తీసుకోగా.. మరోసారి పునరావృతం కాకుండా చూసుకుంటామని వివరణ ఇచ్చుకున్నట్లు తెలిసింది.

**నాటి నుంచి నేటి వరకూ..!**

వాస్తవానికి.. వైసీపీ హయాంలో పనిచేసిన ఐఏఎస్, ఐపీఎస్.. అధికారులు, ఉన్నతాధికారులు, యూనివర్శిటీ వీసీలు ఇలా ఎక్కడా పాత వాసనలు లేకుండా ఇప్పుడిప్పుడే కూటమి సర్కార్ ప్రక్షాళన చేస్తూ వస్తోంది. ఆ మధ్య జీపీఎస్ జీవో, గెజిట్ రిలీజ్ వ్యవహారంలో ఎంత రాద్ధాంతం జరిగిందో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఆఖరికి విచారణ చేయాల్సి వచ్చింది. ఇప్పుడు కూడా రిజిస్ట్రార్ తీరుతో మరోసారి పాత వాసన అనేది బయటపడింది. అందుకే.. ఇకపై ఎలాంటి ప్రకటన అయినా, జీవోలు, గెజిట్‌ల విషయంలో ఒకటికి పదిసార్లు క్రాస్ చెక్ చేసుకుని ఉన్నతాధికారుల అనుమతితో రిలీజ్ చేయాలని అన్ని విభాగాలకు సమాచారం క్లియర్ కట్‌గా వెళ్లిందని తెలిసింది.

## ఖరీఫ్ సీజన్‌కు సంసిద్ధం కావాలి

-మొదటిపేజీ తరువాయి

రైతులకు విక్రయించేందుకు ఎరువులు సిద్ధంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. మిగిలిన లైసెన్స్ లేని సహకార సంఘాలకు తక్షణమే లైసెన్స్ మంజూరు చేసి ఎరువుల విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

## ఐటీ ఉద్యోగులకు రోజుకు 14 గంటల పని...

## అమానుషం అంటూ మండిపడిన పురందేశ్వరి

**14 గంటల పని విధానం అమలు చేయాలనుకుంటున్న ఐటీ కంపెనీలు**

**కర్ణాటక ప్రభుత్వానికి ప్రతిపాదన**

**ఎంతోమంది ఉద్యోగులు కోల్పోతారన్న పురందేశ్వరి**

**ఈ ప్రతిపాదనను కర్ణాటక ప్రభుత్వం తిరస్కరించాలని విజ్ఞప్తి**



ఐటీ ఉద్యోగులకు 14 గంటల పని విధానానికి అనుమతి ఇవ్వాలని బెంగళూరు ఐటీ కంపెనీలు కర్ణాటక ప్రభుత్వానికి ప్రతిపాదన చేసినట్టు వార్తలు వస్తున్నాయి. దీనిపై ఏపీ బీజేపీ చీఫ్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మండిపడ్డారు. 12 గంటల సాధారణ పని, రెండు గంటల అదనపు పని కలిపి మొత్తం 14 గంటల పని విధానం అమలు చేసేందుకే ఐటీ కంపెనీలు ప్రతిపాదన తీసుకురావడం అమానుషం అని పేర్కొన్నారు. ఈ 14 గంటల పని విధానం అమలు చేయడం అంటే, ఐటీ ఉద్యోగుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టడమేనని పురందేశ్వరి అభిప్రాయపడ్డారు. పనిగంటల మార్పుతో రెండు షిఫ్టుల విధానం అమల్లోకి వస్తుందని, తద్వారా మూడింట ఒక వంతు మంది తమ ఉద్యోగాలు కోల్పోతారని వివరించారు. దాంతో నిరుద్యోగం పెరుగుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా, పనిగంటల పెంపుతో ఉద్యోగం-వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత దెబ్బతింటుందని పురందేశ్వరి ఆందోళన వ్యక్తం చేశారు. అధిక సమయం పనిచేయడం వల్ల ఉద్యోగుల్లో నిరాసక్తత ఏర్పడుతుందని, తద్వారా ఉత్పాదకత తగ్గిపోతుందని పురందేశ్వరి వివరించారు. ఈ ప్రతిపాదనను తిరస్కరించాలని, తద్వారా న్యాయబద్ధమైన, మానవీయ పని వాతావరణాన్ని కల్పించాలని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని పురందేశ్వరి ట్వీట్ చేశారు.

## పితానికి కలిసిరాని కాలం



**కాకినాడ :** పితాని సత్యనారాయణ అంటే తెలియని వారుండరు. సీనియర్ నేతగా ఆయన పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక సామాజికవర్గానికి బలమైన నేత. ఆయన వెంటే లక్కు ఉంటుందని అందరూ భావిస్తారు. పార్టీ మారినా అధికారంలోకి రావడమే కాకుండా మంత్రి పదవి కూడా ఇంటికి వచ్చి తలుపుతడుతుందని ఆయన అనుచరులు భావిస్తారు. ఆయన ఉన్న పార్టీ అధికారంలోకి వస్తే చాలు తమ నేతకు మంత్రి పదవి గ్యారంటీ అని విశ్వసిస్తారు ఆయన అనుచరులు. బలమైన శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన పితాని సత్యనారాయణకు నియోజకవర్గంలోనే కాదు జిల్లాలోనూ కీలక నేతగా పరిగణిస్తారు పితాని సత్యనారాయణ కు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి పదవి దక్కింది. ఎన్నికలకు ముందు పార్టీలోకి వచ్చినా చంద్రబాబు పితానికి ఆలస్యంగానైనా మంత్రి పదవి ఇచ్చారు. బలమైన శెట్టి బలిజ సామాజిక వర్గం కావడం, ఆయన సామాజిక వర్గం ఐదారు శాసనసభ నియోజకవర్గాల్లో బలంగా ఉండటంతో ప్రతి పార్టీ ఆయన కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తుంటుంది. పెనుగొండ, ఆచంట నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. రెండుసార్లు మంత్రి పదవిని దక్కించుకున్నారు. శెట్టి బలిజ సామాజికవర్గానికి చెందిన పితాని సత్యనారాయణ కాంగ్రెస్, టీడీపీ హయాంలో ఒక వెలుగు వెలిగారు. ఆయన తొలుత వైసీపీలో చేరాలనుకుని 2014లో ఆయన టీడీపీలో చేరి తిరిగి ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో జగన్ హవా ముందు ఆయన ఓటమి పాలయ్యారు. అయితే 2019 ఎన్నికల్లో ఆచంట నుంచి పోటీ చేసిన పితాని సత్యనారాయణ ఆ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఐదేళ్ల పాటు పార్టీలోనే ఉంటూ జిల్లా వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయడం కోసం ప్రయత్నించారు. పితాని, ఆయన కుమారుడిపై కేసులు కూడా నమోదయ్యాయి. అయితే ఆయన నాడు పార్టీ మారతారన్న ప్రచారం జరిగినా తాను టీడీపీలోనే కొనసాగుతానని చెప్పి పితాని సత్యనారాయణ సైకిల్ పార్టీకి దన్నుగా నిలిచారు. అధికారంలోకి వస్తే తనకు మంత్రి పదవి గ్యారంటీ అని భావించారు. శెట్టి బలిజ సామాజికవర్గంలో తనను మించిన నేత లేరని ఆయన భావించారు. తనను కాదని మంత్రి పదవి ఎక్కడకు పోతుందన్న ధీమాలో ఉన్నారు. కానీ 2024లో ఆచంట నియోజకవర్గం నుంచి పితాని సత్యనారాయణ గెలిచారు. ఇటు కూటమి కూడా అధికారంలోకి వచ్చింది. కానీ మంత్రి పదవి మాత్రం దక్కలేదు. సీనియర్ నేతలను అందరినీ పక్కన పెట్టిన నేపథ్యంలో పితాని సత్యనారాయణను కూడా టీడీపీ అధినేత తన కేబినెట్ లో చోటు కల్పించలేదు. ఫలితంగా ఆయన తీవ్ర నిరాశకు గురయినట్లు తెలిసింది. గత కొద్ది రోజులుగా నియోజకవర్గానికే పరిమితమైన పితాని సత్యనారాయణ విజయవాడకు ముఖ్యమైన సమావేశాలకు కూడా రాలేదని చెబుతున్నారు. తాను మంత్రి పదవి ఊహించుకుంటే తనను సీనియర్ పేరిట సాకుగా చూపి యువకుడైన అదే సామాజికవర్గానికి చెందిన వాసంశెట్టి సుభాష్ కు ఇవ్వడంతో ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెబుతున్నారు. కానీ ఇప్పుడు ఎవరినీ ఏమీ అనలేని పరిస్థితి. వెయిట్ చేయడం తప్ప. అంటూ ఆయన అనుచరులు నిట్టూరుస్తున్నారు.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



# గాయంవారిపల్లిలో గారడీ

- పనులు చేయకుండానే బిల్లులు
- సిసి రోడ్డు వేసినట్లు లక్షల్లో నగదు స్వాహా
- మట్టి రోడ్లలో కూడా మాయాజాలం
- అప్పటి ఏఈ రూటే సపరేటు....
- ఆ పంచాయతీ కార్యదర్శులకు నిద్ర లేని రాత్రులు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 21)

*గాయంవారిపల్లిలో గారడీ జరిగింది....గారడీ విద్య నిజమో కాదో తెలియదు కానీ గాయంవారిపల్లి అనే గ్రామంలో మాత్రం రోడ్ల నిర్మాణంలో గారడీ చోటు చేసుకుంది. పనులు చేయకుండానే ఎంబుక్‌లు రికార్డులు చేసి నిధులు స్వాహాకు అప్పటి ఏఈ పూర్తిగా సహకరించారు. ఆ గ్రామ నాయకుడే మండల స్థాయి ప్రజాప్రతినిధి కావడంతో రోడ్లు నిర్మాణం జరగకుండానే ఎంబుక్‌లు రికార్డు చేసి అప్పటి పంచాయతీ రాజ్ ఏఈ చెన్నకేశవులు స్వామి భక్తి చాటుకున్నారు.*

వివరాల్లోకి వెళితే.... హనుమంతునిపాడు మండలం గాయం వారిపల్లిలో ప్రభుత్వ నిబంధనలు పని చేయవు. పాలకుల మాటలే అక్కడ చట్టం. అందుకు వత్తాసుగా పిఆర్ ఏఈ వ్యవహరించడంతో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. సిసి రోడ్ల నిర్మాణాలు జరగకుండానే జరిగినట్లు ఎంబుక్ రికార్డు చేసి ఏఈ బరితెగింపుకు పాల్పడ్డారు. అప్పటి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ సిఎస్‌పురం మండలంలో రోడ్లు వేయకుండానే నిధులు డ్రా చేసిన విషయం అందరికీ తెలిసిందే...ఆయన కన్నా మేమేం తక్కువ అంటూ హనుమంతనిపాడు ప్రజాప్రతినిధి కూడా పనులు చేయకుండానే బిల్లులు చేయించుకుని లక్షలు దిగమింగారనే ఆరోపణలున్నాయి. దేవుడి పేరుతో సిసి రోడ్డు మంజూరు చేయించి సిసి రోడ్డు వేయకుండానే రూ.7 లక్షలు స్వాహా చేసినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆ గ్రామంలోని హరిజన పాలెం నుండి పోలేరమ్మ గుడి వరకు సిసి రోడ్డు మంజూరైంది. అప్పట్లో ఆ రోడ్డులో అక్కడక్కడ డస్ట్ కుప్పలు తోలారు. డస్ట్ కుప్పలను చూసి సిసి రోడ్డు పూర్తయినట్లు ఆ ఏఈ ఎంబుక్ రికార్డు చేయడం గమనార్హం. ఆ గ్రామంలో ప్రజలు తిరిగే రోడ్లను గాలికొదిలేసి ఆ ప్రజాప్రతినిధి తన తోట వద్దకు రూ.9.70 లక్షలతో సిసి రోడ్డు వేయించుకోవడం గమనార్హం. అంతే గాక గాయంవారిపల్లి నుంచి తాటిచర్ల పల్లి, మారంరెడ్డిపల్లి నుంచి తాటిచర్లపల్లి, మారంరెడ్డిపల్లి నుంచి దాసరిపల్లి వరకు ఐదు గ్రావెల్ రోడ్లు వేసినట్లు రికార్డులు సృష్టించి రూ.7.50 లక్షలు స్వాహా చేసినట్లు విశ్వసనీయ సమాచారం. తన బంధువు పేరుతో జలజీవన్ మిషన్ కాంట్రాక్టు పొంది సగం పైపు లైను వేసి పాత పైపు లైనుకు కనెక్షన్ ఇచ్చి రూ.18 లక్షల పనిలో రూ.10 లక్షలకు పైగా అవినీతికి పాల్పడ్డారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఒకే రోడ్డుకు మండల పరిషత్ నిధులను, ఎంపి గ్రాంటును, గడపగడపలో భాగంగా సచివాలయాలకు కేటాయించిన నిధుల్లో రూ.20 లక్షలు స్వాహా చేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. డంపింగ్ యార్డును ప్రజా ప్రతినిధి తన తోటలో కట్టుకుని ఆ షెడ్డును తన సొంతానికి ఉపయోగించుకుంటున్నారని సమాచారం. ఎంపిపి, సర్పంచ్ ఒకే కుటుంబీకులు కావడంతో ఏకగ్రీవ పంచాయతీ నిధులతో పాటు ఇతర నిధుల్లో కూడా అవినీతి జరిగిందని గ్రామస్థులు తెలిపారు. పనులు చేయకుండానే ఎంబుక్ లు రికార్డు చేసిన అప్పటి ఏఈ చెన్నకేశవులు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొంది రాష్ట్ర స్థాయిలో ఓ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఏఈ చేసిన ఎంబుక్‌ల ప్రకారం రోడ్ల ను పరిశీలించి డిఈ చెక్ మెజర్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. కానీ డిఈ కూడా గుడ్డిగా చెక్ మెజర్‌మెంట్ చేసి నిధుల దుర్వినియోగానికి కారకులయ్యారు.

## కార్యదర్శులకు నిద్రలేని రాత్రులు

గాయంవారిపల్లి పంచాయతీలో పని చేసిన అప్పటి పంచాయతీ కార్యదర్శులు నిద్ర లేని రాత్రులు గడిపినట్లు వారు వాపోయారు. సంవత్సరం పని చేయాలంటే టెన్షన్‌తో చచ్చిపోయే వారమని ఓ కార్యదర్శి వాపోయాడు. ఏఈ చెన్నకేశవులు బరితెగింపును చూసి భయపడినా పరమేశ్వరి, శ్రీనివాస్ యాదవ్, నరసింహులు అనే పంచాయితీ కార్యదర్శులు భయపడి సెలవుల పై వెళ్ళారంటే ఆ పంచాయతీలో పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత కార్యదర్శి షరీఫ్ కూడా ఈ మండలమే వద్దు బాబు అంటూ స్థానికుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. పనులు చేయకున్నా ఏఈ, ఈఈ నిధుల డ్రా చేసేందుకు సర్టిఫికేట్ ఇస్తుండడం వల్లే డబ్బులు డ్రా చేసి ఇచ్చామని ఓ పంచాయతీ కార్యదర్శి వెలుగు ప్రతినిధికి తెలిపారు. వైకాపా పాలనలో జరిగిన ఈ అవినీతి పై ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి విజిలెన్స్ విచారణ జరిపించి దుర్వినియోగమైన ప్రభుత్వ నిధులను రికవరీ చేసి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## గాయం తిరుపాలురెడ్డి, గ్రామస్థుడు



నేను కాంట్రాక్టర్‌నే....పనులు చేస్తేనే అధికారులు బిల్లులు చేస్తారు. కానీ మా గ్రామంలో మట్టి రోడ్లు, సిసి రోడ్లు వేయకుండానే ఏఈ చెన్నకేశవులు వేసినట్లుగా ఎంబుక్‌లు రికార్డు చేశారు. ఇదేంటని అడిగితే మీ ప్రభుత్వం వచ్చిందిగా మీరు కూడా అలానే చేయించుకోండి, డిపార్టుమెంట్‌ను ఇబ్బంది పెట్టద్దు అని చెప్పారు. ఏఈ చెన్నకేశవులు పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి.

## అన్ని పనుల పై విచారణ జరపాలి మోరా శశికాంత్‌రెడ్డి



వైసీపీ పాలనలో గాయంవారిపల్లిలో అవినీతికి అడ్డే లేదు. సుమారు కోటి రూపాయల నిధులు స్వాహా అయ్యాయి. సమగ్ర విజిలెన్స్ విచారణ జరిపి అక్రమార్కుల పై చర్యలు తీసుకోవాలి.

## ఫోన్‌కు స్పందించని డిఈ, ఈఈ

రోడ్లు వేయకుండానే ఎంబుక్‌లు చేసిన వ్యవహారం పై వెలుగు ప్రతినిధి డిఈ, ఈఈ లకు ఫోన్ చేసినా ఎటువంటి స్పందన లేదు..




# స్పా సెంటర్ల పేరుతో చట్టవిరుద్ధమైన, అసాంఘిక, అనైతిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

### జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

### నగరంలోని స్పా సెంటర్లపై ఏక కాలంలో దాడులు నిర్వహించిన పోలీసు బృందాలు




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 21)

చట్టవ్యతిరేక, అసాంఘిక , అనైతిక కార్యకలాపాలు కట్టడే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు, సిబ్బందితో కలసి శనివారం ఒంగోలు నగరంలోని ఒంగోలు వన్ టౌన్, టూ టౌన్, తాలూకా పోలీస్ స్టేషన్ల పరిధిలోని 16 స్పా సెంటర్లపై డిఎస్పీ, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో మూకుమ్మడిగా తనిఖీలు నిర్వహించారు. కేసుకు సంబంధించిన వివరాలను ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం సాయంత్రం డిఎస్పీ కిషోర్ కుమార్ మీడియా సమావేశంలో తెలిపారు. స్పా సెంటర్ల పైన జరిపిన దాడులలో గుంటూరు రోడ్డులోని సార బ్యూటీ సెలూన్ అండ్ స్పా సెంటర్‌లో నిబంధనలకు విరుద్ధంగా స్పా ముసుగులో అనైతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గుర్తించి స్పా సెంటర్ నిర్వాహకుడు, ఐదుగురు మహిళలతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు పాల్గొనేందుకు వచ్చిన (తరువాయి 4లో...)

# వైసీపీ ఉన్నట్లా..లేనట్లా..?




- ఎన్నికలకు ముందు సింగరాయకొండ పార్టీ ఆఫీసు చుట్టూ ప్రదక్షిణలు
- పార్టీ ఓటమి తర్వాత ఆ వైపు కన్నెత్తి చూడని వైనం
- పార్టీలో పదవులున్నా పది ఓట్లు కూడా వైసీపీకి వేయించలేదు
- మాజీ మంత్రి సురేష్ వస్తే మొహం చాటేసిన నేతలు
- గడచిన సార్వత్రిక ఎన్నికల్లో దేశం పార్టీకి ఫుల్ సపోర్ట్
- అందిన కాడికి రెండు వైపులా సొమ్ము దోచుకున్న కోవర్టులు
- టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు యత్నం
- అనర్హులను స్టేజీల మీద కూర్చొని పెట్టడమే వైసీపీకి శాపమా?

(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, జులై 21)

ప్రకాశం జిల్లా కొండపి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదివారం సింగరాయకొండ వైసీపీ పార్టీ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. 10 గ్రామ పంచాయతీలకు సంబంధించిన నేతలు పలువురు మొహం చాటేశారు. దీనికి కారణం లేకపోలేదు. వైసీపీ పార్టీలో కొనసాగుతూ పార్టీలో రాజకీయ కోవర్ట్ లాగా వ్యవహరిస్తూ కడుపులో కత్తులు పైకి పొత్తుల్లాగా వ్యవహరించి నమ్మించి వైసిపి పార్టీని నట్టేట ముంచారు. వాళ్ళు ఎవరో కాదు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీలో పదవులు పొందిన పలువురు నేతలు. ముందుగానే తెలుగుదేశం పార్టీ నాయకులతో రహస్య రాజకీయ ఒప్పందాలు కుదుర్చుకుని గడచిన సార్వత్రిక ఎన్నికల్లో (తరువాయి 4లో...)

# ట్రాన్స్‌జెండర్స్‌కు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 21)

రాష్ట్రంలో ట్రాంజెండర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై విజయవాడలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఒంగోలు టిడిపి నాయకురాలు బోను దుర్గ ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ట్రాంజెండర్స్ ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలపై వివరించారు. అలాగే ట్రాంజెండర్స్‌కి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, బోర్డు, సేల్టర్స్ హోమ్స్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు త్వరలోనే నిర్ణయాన్ని ప్రకటిస్తామని, అలాగే సమస్యలపై చర్చిస్తానని తెలిపారు. ఆమెతోపాటు గుంటూరు నుండి నీరజ, శివమ్మ, చిలకలూరిపేట నుంచి శ్వేత, తెనాలి నుంచి ప్రీతి, గాయత్రి, సుధా పాల్గొన్నారు. వీళ్లతో పాటు కడప నుంచి ట్రాన్స్మెన్ సూర్య పాల్గొన్నారు.



# ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత

### కొత్త బస్సులను ప్రారంభించిన మంత్రి డాక్టర్ డోలా



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 21)

రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్రా సాంఘిక సంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ, సచివాలయం, గ్రామ వాలంటీర్ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఆదివారం సాయంత్రం మంత్రి బాల వీరాంజనేయ స్వామి ఒంగోలు డిపో నందు రెండు నూతన స్టార్ లైన్ బస్సులను, మూడు సూపర్ లగ్జరీ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ రోజు గురు పౌర్ణమి సందర్భంగా ఒంగోలు డిపోలో ఐదు నూతన బస్సులను ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కాలం చెల్లిన బస్సుల స్థానంలో 25 శాతం బస్సులను రీప్లేస్ చేయడం అనేది మంచి పరిణామని అన్నారు. కాలం చెల్లిన బస్సులన్నింటినీ రీప్లేస్ చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతికి ప్రాధాన్యత ఇస్తూ తిరుపతికి కూడా స్లీపర్ కోచ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి ఈ సందర్భంగా ఆర్.ఎంకు సూచించారు. గత పది రోజుల్లోనే నాలుగు నూతన స్టార్ లైన్ బస్సులను, 5 సూపర్ లగ్జరీ బస్సులను ప్రారంభించుకోవడం జరిగిందని మంత్రి తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేయుటకు విధివిధానాల (తరువాయి 4లో...)

# గాయంవారిపల్లిలో గారడీ





# స్పా సెంటర్ల పేరుతో చట్టవిరుద్ధమైన, అసాంఘిక, అనైతిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

కొడువాలిల్ నితిన్, ఈత అవినాష్, కనమర్లపూడి పద్మనాభం, సార స్పా సెంటర్ నిర్వాహకుడు కిమిడి పవన్ కుమార్ ల పై కేసు నమోదు చేసారు. దాడి జరిగిన సమయంలో తప్పించుకున్న ఒక వ్యక్తిపై ఒంగోలు తాలూకా పీఎస్‌లో ప్రత్యేకమైన కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఒంగోలు, అంజయ్య రోడ్ ఎస్-ఎస్ సెలూన్ అండ్ స్పా సెంటర్‌లో నిర్వాహకుడు, ఒక మహిళతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు పాల్గొనేందుకు వచ్చిన మానం నాగరాజు, స్పా సెంటర్ల నిర్వాహకులు తురిమెళ్ల పోతురాజు పై ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. ఒంగోలు, బాలాజీరావుపేటలోని "0" రేంజ్ యునిసెక్స్ సెలున్ స్పా సెంటర్‌లో నిర్వాహకుడు కొణిజేటి కన్నయ్య, శేషాచలం మానస, మహమ్మద్ ముజాజౌల్ హుస్సేన్ ల పై ఒంగోలు వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. స్పా, మసాజ్ సెంటర్ల పేరుతో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు, అసాంఘిక, అనైతిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. అనుమతులు లేని స్పా, స్నూకర్, రిక్రియేషన్ క్లబ్‌లకు ఇళ్లను అద్దెకిచ్చి కేసుల్లో ఇరుక్కోవద్దని యజమానులకు పోలీసుల సూచించారు. ఈ సమావేశంలో ఒంగోలు వన్ టౌన్ సిఐ ఆలీ సాహెబ్, ఒంగోలు టు టౌన్ సిఐ జగదీష్, ఒంగోలు తాలూకా సిఐ షేక్ ఖాజావలి, ఒంగోలు రూరల్ సిఐ అజయ్ కుమార్, చీమకుర్తి సిఐ సుబ్బారావు, ఒంగోలు సబ్-డివిజన్ ఎస్ఐలు, ఏఆర్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైసీపీ ఉన్నట్టా..లేనట్లా..?

వైసీపీ పార్టీకి సంబంధించిన పలువురు నేతలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థికి ఓట్లు భారీగానే వేయించారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడమే కాదు ఆదిలోనే ఒప్పందం కుదుర్చుకున్న మాట అని వైసీపీ కార్యకర్తలు పలువురు ఆరోపిస్తున్నారు. అయితే అందులో భాగంగా మాజీమంత్రి సురేష్ సింగరాయకొండలో ఆదివారం క్యాంపు కార్యాలయంకి వచ్చిన సందర్భంగా పార్టీ నాయకులతో పలు విషయాలపై మాట్లాడారు. అనంతరం సింగరాయకొండ పట్టణానికి దక్షిణం భాగంలో ఉన్న జాతీయ రహదారి పక్కన వెలసి ఉన్న సాయిబాబా మందిరానికి చేరుకున్నారు.

ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రధాన అధికారి కొల్లూరి సత్యనారాయణ యాదవ్, మాజీ మంత్రి సురేష్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించారు. వారి కోరిక మేరకు సురేష్ సాయిబాబా మందిరంలో స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కొల్లూరి సత్యనారాయణ, బాబా భక్త బృందం కమిటీ సభ్యులు సురేష్‌ను ఘనంగా సత్కరించారు.

అంతవరకు బాగానే ఉంది. ఇక రాజకీయ విషయానికి వస్తే వైసీపీ పార్టీ క్యాంపు కార్యాలయంలో పలువురు నేతలు బుధవారం రాజధాని ఢిల్లీలో జరగబోయే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టబోతున్న ధర్నా కార్యక్రమానికి మేము సైతం అంటూ వస్తామని పలువురు నాయకులు మాజీ మంత్రి సురేష్‌తో అన్నారు. అందుకు సురేష్ ట్రైన్‌లో వచ్చే పని అయితే రావచ్చు అని సలహా ఇచ్చారని పలువురు నేతలు చెబుతున్నారు. సింగరాయకొండ వైసీపీ మండల నాయకులు పలువురు ఆదివారం క్యాంపు కార్యాలయం వద్దకు రాకపోవడం గమనార్హం.

**వైసీపీకి అనారోగ్యం సోకింది**

వైసిపి పార్టీ మండల పరిధిలోని పలువురు నేతలకు వైద్య పరీక్షలు చేసి దేశం పార్టీ నాడి వారి చేతుల్లో కొట్టుకుంటుందా? లేదా వైసిపి పార్టీ నాడీ కొట్టుకుంటుందా అన్న ప్రశ్నకు ఒక ఆర్ఎంపీ డాక్టర్ని ప్రత్యేకంగా ఈ మండలానికి పంపించి తెలుసుకోవలసిన విషయాలు ఉన్నాయి. వాస్తవంగా వైసీపీకి చెందిన అసలు సిసలైన కార్యకర్తలు నియోజకవర్గ పరిధిలో అవినీతి, రాజకీయ నేతలు పలువురు పుణ్యమా అంటూ వీరి పాపానికి వైసీపీ కార్యకర్తలు నిత్యం నోరు కొట్టుకుంటున్నారు. పార్టీలో నమ్మకద్రోహమే నట్టేట ముంచిందన్న విషయం సురేష్‌కు ముందుగానే పలువురు నేతలు చెప్పారని రాజకీయ వినికిడి. 10 ఓట్లు లేని వారు కూడా అలాంటి వారిని స్టేజీల మీదకి ప్రత్యేకంగా ఆహ్వానించడం పై అసలు సిసలైన వైసీపీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని పక్కన పెట్టుకుని పార్టీకి తీరని నష్టం జరుగుతుందని ముందే గ్రహించిన కార్యకర్తలు సురేష్ దృష్టికి తీసుకెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆ విషయాలు ఆయన పట్టించుకోకపోవడమే ఆయన ఓటమికి ఓ కారణం. ఎదుటి వ్యక్తి చెప్పే మాటలు వినాల్సిన వ్యక్తి మీరు చెప్పొద్దంటూ సలహాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ తెలుగుదేశం పార్టీకి సంబంధించిన నాయకత్వానికి తోడు వైసీపీకి సంబంధించిన పలువురు నేతలు వారితో ఎన్నికల సమయంలో దేశం పార్టీ అభ్యర్థికి అనుకూలంగా ఓట్లు వేయించిన విషయం అందరికీ తెలిసిందే. ఏది ఏమైనా సింగరాయకొండ మండలంలో వైసీపీ ఉన్నట్టా లేనట్లా అన్న ప్రశ్న కూడా కార్యకర్తల్లో సందేహం వ్యక్తం అవుతుంది. పై విషయాలపై తాడేపల్లి వైసీపీ పెద్దలు జబ్బు చేసిన సింగరాయకొండ మండల వైసీపీ పార్టీకి వైద్యం చేస్తారా లేదా మాకు పట్టింది కాదంటూ మీన మేషాలు లెక్కిస్తారా అనేది కాలమే నిర్ణయించాలి.

# ఉగ్ర ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం







(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 21)

స్థానిక అమరావతి గ్రౌండ్‌లో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కనిగిరి ప్రాంతంలోని సుమారు 750 మంది కంటి రోగులు ఈ వైద్య శిబిరంలో వైద్య సేవలు పొందారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు పాల్గొన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను ఆయన అభినందించారు. అనంతరం పామూరు మండలం కోడిగుంపల్లిలో జరిగిన సీనియర్ న్యాయవాది కొప్పల్లి సుబ్బరాయుడు ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పాల్గొని నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.

# నీటి ట్యాంకర్‌ను ప్రారంభించిన కందుల విగ్నేష్

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 21)

పొదిలి నగర పంచాయతీ పరిధిలోని ఆరోవ వార్డు ఎస్టీ కాలనీలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండడంతో స్పందించిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు నీటి ట్యాంకర్‌ను తెలుగుదేశం పార్టీ యువ నాయకులు కందుల విగ్నేష్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ముల్లా ఖుద్దూస్, మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం భాష, బుచ్చిబాబు, ముక్కర కిరణ్‌కుమార్, షేక్ యాసీన్, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.



# ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత



రూపకల్పనలో ఉన్నామన్నారు. భవిష్యత్తులో విడతల వారీగా పాడైన బస్సుల స్థానంలో కొత్త బస్సులను ఏర్పాటు చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. మంచి సదుపాయాలతో ఏర్పాటు చేస్తున్న ఆర్.టి.సి బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి, ఈ సందర్భంగా ప్రజలను కోరారు. ఆర్టీసీ ఆర్ఎం మాట్లాడుతూ, ఒంగోలు రీజియన్‌లో పాడైన బస్సుల స్థానంలో 67 కొత్త బస్సులు రావడం జరిగిందని, సుమారు 20 నుండి 25 శాతం బస్సులు కొత్త బస్సులు నడుస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు మిగతా జిల్లాల్లో కంటే మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ఆర్.ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# గోలమరి వారి నిశ్చితార్థ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యేలు అన్నా, కేపీ



(షణ్ముఖ వెలుగు, మార్కాపుం మున్సిపాల్టీ, జులై 21)

మార్కాపురం పట్టణంలోని బి.కన్వెన్షన్ హాలు నందు జరిగిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోలమరి శ్రీనివాసరెడ్డి కుమార్తె నిశ్చితార్థ వేడుకల్లో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కెపి నాగార్జునరెడ్డి పాల్గొన్నారు. అనంతరం కాబోయే నూతన వధువరులు పార్వతి, శేఖర్ రెడ్డిలను వారు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

# హరిహరక్షేత్రంలో శిద్దా దంపతుల పూజలు







(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, జులై 21)

గురు పూర్ణిమ పురస్కరించుకొని శ్రీ హరిహర క్షేత్రంలో రాష్ట్ర మాజీమంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా లక్ష్మి పద్మావతి దంపతులు విశేష పూజలు నిర్వహించారు. పౌర్ణిమ సందర్భంగా క్షేత్రంలో జరిగిన చండి హెూమంలో పాల్గొని పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు శిద్దా రాఘవరావు దంపతులకు వేద ఆశీర్వాదాలు అందజేశారు.

# క్రియాశీలక సభ్యత్వం భావోద్వేగమైన ప్రయాణం

## జనసేన సిటీ నాయకులు గునుకుల కిషోర్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 21)

జనసేన పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి జిల్లా పర్యవేక్షకులు వేములపాటి అజయ్ ఆధ్వర్యంలో నెల్లూరు సిటీలో ప్రతిష్టాత్మకంగా సభ్యత నమోదు మార్కు చూపించాలని కోరుకుంటున్నట్లు -జనసేన సిటీ నాయకులు గునుకుల కిషోర్ తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కార్యకర్తల కోసం అధ్యక్షులు ఇన్సూరెన్స్ చేయడం, ప్రమాదం జరిగితే కార్యకర్తలకు రూ.50,000 భీమా, దురదృష్టవశాత్తు వ్యక్తిని కోల్పోతే రూ.5,00,000 వారి కుటుంబాలకు ఇవ్వడం అనేది ఒక చారిత్రాత్మక ఘట్టమన్నారు. మా జనసేన నాయకులు అనుదీప్, శ్రీకాంత్, మనోజ్ తదితర నాయకులు ప్రజా కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు తిరిగినపుడు జనసేన పార్టీకి, మా పవన్ కళ్యాణ్‌కు ఉన్న ప్రత్యేకతను గుర్తించామన్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలు అందరూ కూడా ఈ క్రియాశీలకు సభ్యత్వాన్ని సభ్యత్వ నమోదులో జనసేన మద్దతు దారులని చేర్చే మహత్తర కార్యక్రమాన్ని అందరూ ముందుకు తీసుకెళ్లాలన్నారు.

# అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగ సమస్యలు చర్చించాలి

## జిల్లా ప్రజా ప్రతినిధులకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ లేఖ




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 21)

జులై 22నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రకాశం జిల్లా విద్యారంగ అభివృద్ధి,సమస్యల పరిష్కారం కు చర్చించాలని కోరుతూ జిల్లా ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు, లేఖలు రాయడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఒంగోలులోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో, జిల్లాలో విద్యరంగంలో నెలకొన్న ముఖ్యమైన సమస్యలను ఎమ్మెల్యేలో దృష్టికి తీసుకు వస్తున్నామన్నారు. వాటి పరిష్కరానికై ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళి సమస్యల పరిష్కారానికై కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న హాస్టళ్ల మెస్, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయాలని కోరారు. జీవో నెంబర్ 77 రద్దుచేసి ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివే పీజీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ అందించాలని కోరారు. దాంతోపాటు పాత బకాయిలు విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని వర్తించేలా అమలు చేయాలని కోరారు. డిగ్రీ విద్యలో ఆన్లైన్ అడ్మిషన్లు రద్దు చేయాలని, మేజర్ మైనర్ వ్యవస్థను తొలగించాలని కోరారు. పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ సమాంతర మీడియాలలో బోధన అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పాఠశాల విద్యలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవో ప్రాథమిక విద్యకు ఉరితాడుగా మారింది. జీవోను రద్దు చేయాలని, తరగతుల విలీనం పేరుతో విలీనమైన పాఠశాలలను తిరిగి యధావిధిగా కొనసాగించాలని కోరారు. జీవో 42, 50,52ల ద్వారా గత ప్రభుత్వం ఎయిడెడ్ విద్యాసంస్థలను ప్రైవేటుపరం చేసినా వాటిని ఎయిడెడ్ విద్యాసంస్థలుగా తిరిగి కొనసాగించాలి. జీఓ 35 రద్దు చేసి పూర్తి ఎయిడ్ ఇవ్వాలని కోరారు. నూతన ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్లు అమ్ముకునే విధంగా 107, 108 జీఓ లను రద్దు చేయాలని కోరారు. ప్రకాశం జిల్లాకు కేటాయించిన యూనివర్సిటీ, ట్రిబుల్ ఐటీలకు నిధులను కేటాయించి సొంత భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఒంగోలు నగరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని కోరారు. పొన్నలూరు మండల కేంద్రంలో నిర్మించిన ఎస్టీ గురుకుల పాఠశాల భవనాన్ని మిగిలిన 10 శాతం నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. మార్కాపురం, గిద్దలూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని కోరారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి, ఈపాటికి వున్న సొంత భవనాలకు రిపేర్లు చేపించాలని కోరారు. ప్రకాశం జిల్లాను వెనకబడిన జిల్లాగా గుర్తించి ఫీజుల్లో రాయితీలు కల్పించాలి, ఉచిత బస్సు పాసులు ఇవ్వాలన్నారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీకి అనుబంధంగా గవర్నమెంట్ ఇంజనీరింగ్, మైనింగ్ కాలేజీలు ఏర్పాటు చేయాలన్నారు. మార్కాపురం గవర్నమెంట్ మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయాలి 2025 విద్యా సంవత్సరానికి క్లాసులు ప్రారంభించాలన్నారు. చీమకుర్తిలోని డిగ్రీ కాలేజీ విద్యార్థులకు చీమకుర్తిలోనే పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. దర్శిలో డ్రైవింగ్ పాఠశాల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. మార్కాపురంలో 1500 మంది బాలికలతో నడుస్తున్న పాఠశాల సంఖ్యకు అనుగుణంగా బాలికల హాస్టల్లను ఏర్పాటు చేయాలన్నారు. పొదిలి లో కాలేజీ బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సీఎంఈ, ఈసీఈ కోర్సులు ప్రారంభించాలన్నారు. కార్పొరేటు విద్యాసంస్థలను నియంత్రించాలి, విద్యాహక్కు చట్టాన్ని పగడ్బందిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.విజయ్ నగర కమిటీ సభ్యులు విజయకుమార్ పాల్గొన్నారు.

# ఘనంగా గురు పూర్ణిమ వేడుకలు





(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, జులై2 1)

మండల కేంద్రంలోని శ్రీశైలం వెళ్లే రోడ్డు మార్గంలో శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురు పూర్ణిమ వేడుకలు అత్యంత వైభవంగా ఆదివారం నాడు నిర్వహించారు. గురు పూర్ణిమ సందర్భంగా ఆలయ అర్చకులు పి.మణికంఠ శర్మ ఆధ్వర్యంలో ఉభయ దాతలతో గణపతి పూజ, పాలాభిషేకం పుణ్యావాచనం శ్రీ షిరిడి సాయిబాబా భక్తులతో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి మంగళహారతి ఇవ్వడం జరిగింది.ఈ హారతిలో భక్తులు మహిళలు అధి సంఖ్యలో పాల్గొని,స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీ షిరిడిసాయిబాబా దేవస్థానం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి సుమారు 2000 మంది పైగా పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు స్వామీ వారి గ్రామోత్స కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ షిరిడి సాయి బాబా ఆలయ కమిటీ అధ్యక్షులు పెరుమూళ్ళ యోగి వెంకటనారాయణ, ఉపాధ్యక్షులు అయితా వెంకట సుబ్బారావు, సెక్రెటరీ తుమ్మంద్రు వెంకటేశ్వర్లు (గాంధీ), జాయింట్ సెక్రటరీ యక్కలి యోగి నారాయణ, ట్రెజరర్ అన్నా నాసరయ్య, కార్యవర్గ సభ్యులు రావిక్రింది లక్ష్మి నరసింహ రావు, ఒంటేరు వెంకటరమణ యాదవ్, ఘంటా గురువారెడ్డి, మూడమంచు మల్లికార్జునరావు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్ఎంపి వైద్యులు యర్రం వెంకటరెడ్డి ప్రత్యేక పూజలు





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 21)

గురు పౌర్ణమి సందర్భంగా దర్శి రోడ్‌లో గల సాయిబాబా గుడికి గత ఐదు సంవత్సరాలుగా నిత్య అన్నదానం చేస్తున్న ఆర్ఎంపి వైద్యులు డాక్టర్ యర్రం వెంకట్‌రెడ్డి దంపతులు ఆదివారం స్థానిక సాయిబాబా గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు వారికి మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కలువా సత్యనారాయణ, సామి రాజా, మేడా శ్రీనివాసరావు, సోమిశెట్టి చిరంజీవి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర హక్కుల కోసం నిలబడాలి

## టిడిపి ఎంపీలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు హితవు

## ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా అసెంబ్లీలో అన్నీ చర్చించాలని సూచన




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 21)

రాష్ట్ర హక్కుల కోసం తెలుగుదేశం ఎంపీలు నిలబడాలని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు హితవు పలికారు. పార్లమెంటు, అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం ఒంగోలు సుందరయ్యభవన్లో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రజలు కోటి ఆశలతో కొత్త ప్రభుత్వంపై ఉన్నారన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. అరాచకపు నిరంశకుపు పాలన పోయిందాని చెప్పుకుంటున్న తరుణంలో కూటమి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కారం చేస్తుందాని భావిస్తున్నారన్నారు. ఇపుడు కేంద్రంలో మోడి ప్రభుత్వం చంద్రాబాబు, నితీష్ కుమార్లపై ఆధారపడి రెండు ఊతకర్రల సాయంతో పాలన సాగిస్తున్నారన్నారు. అయితే ఇప్పటికే నితీష్ కుమార్ బీహార్ కోసం ప్రత్యేక హెూదా, నిధులు కోరారని, ఆయన ప్రణాళిక ఏమిటో ప్రకటించారన్నారు. అయితే చంద్రాబాబు మౌనంగా ఉన్నారని, గతంలో జగన్ రాజీధోరణి అవలంభించడం వల్లనే మట్టికరిచిపోయాడని గుర్తుచేశారు. ఆ గుణపాఠాలను టిడిపి నేర్చుకుని మేల్కోకుంటే బిజేపి ధృతరాష్ట్ర కౌగిలికి బలికాక తప్పదాన్నారు. ప్రత్యేక హెూదా, విశాఖ ఉక్కు ప్రవేటీకరణాకుండా చూడటం, కడప స్టీల్ ఫ్యాక్టరీ,రాష్ట్ర విభజన హామీలు కోసం పార్లమెంటులో గట్టిగా నిలబడాలన్నారు. సిఎం చంద్రబాబు కూడా పార్లమెంటు సభ్యుల సమావేశంలో ఎక్కువ నిధ్నాలు తేవాలని కోరారే తప్ప హక్కులపై ప్రస్తావన లేదని గుర్తు చేశారు. బీజేపికి మద్దతు ఇచ్చే వైసిపి కూడా గట్టిగా ఉండాలన్నారు. రాష్ట్రం కోసం ఢిల్లీలో ధర్నాలు చేయాలని, ఇక్కడ ఏమైనా అల్లర్లు, గొడవలు ఉంటే అసెంబ్లీలో చర్చించాలని సూచించారు. ఇపుడు జగన్ అందుకు భిన్నంగా ఢిల్లీలో ధర్నా అంటున్నారన్నారు. రాష్ట్రహక్కులపై ఢిల్లీలోధార్నా చేస్తే మేలు జరుగుతుందని సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లోనూ అన్ని రకాల సమస్యలపై చర్చించి పరిష్కారాలు లభించేలా చూడాలని కోరారు. ప్రజలు చాలా ఆకాంక్షలతో ఉన్నారన్నారు. నాలుగేళ్లలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.61,500 కేటాయిస్తే రూ.32వేల కోట్లు మాత్రమే ఖర్చుచేశారన్నారు. పదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులపై పాలకులకు చిత్తశుద్ధికనిపించలేదాన్నారు. జంధ్యావతి ప్రాజెక్టు పరిధిలో కేవలం 150 మీటర్ల స్థల వివాదాం వల్ల 3.5 టిఎంసీ నీటినిరైతులు వాడుకోకుండా వదిలేయాల్సి వచ్చిందాన్నారు. రాష్ట్రంలో 90శాతం పూర్తయిన ప్రాజెక్టులకు కొద్దిపాటి నిధ్నాలు కేటాయిస్తే రైతులకు పూర్తిగా వినియోగంలోకి వస్తాయన్నారు. ఇలాంటివి 10 నుంచీ 15 వరకూ ఉన్నాయన్నారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం అందించకుండా ప్రాజెక్టును గత అక్టోబర్‌లో జగన్ ప్రారంభించారన్నారు. కాలువలూ పూర్తి కాలేదాన్నారు. దీని వల్ల ఎవరికి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అదిగో ఇదిగో ప్రారంభం అంటూ ముహుర్తాలతోనే కాలయాపం చేశారన్నారు. నిర్వహణకు కూడా నిధులు ఇవ్వనందున ప్రాజెక్టులు అధ్వానంగా మారాయన్నారు. వెనుకబడిన ప్రకాశం వంటి జిల్లాలకు భృందేల్ ఖండ్ తరహా ప్యాకేజీలు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ప్రకాశం బాగా వెనుకబడిందని రూ.10వేల కోట్లు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎస్కేమాబు, కంకణాల ఆంజనేయులు పాల్గొన్నారు.

# తర్లుపాడులో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు







(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జులై 21)

మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక షిరిడి సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు ఆలయ కమిటీ చైర్మన్ మాదాల మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని అనేకమంది భక్తులు పాల్గొని దేవుని దర్శించుకున్నారు. దేవుని తిలకించేందుకు మార్కాపురం డివిజన్ సబ్ కలెక్టర్ రాహుల్ మీనా కూడా వచ్చి పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం దాతలు కుందురు పెద్ద కాశిరెడ్డి తదితర ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులతో పాటు గ్రామంలోని ప్రజలందరూ విరివిగా పాల్గొన్నారు, సాయంత్రం 6 గంటలకు సాయిబాబాను పురవీధుల్లో మహిళల కోలాటాల మధ్య దేవుని స్మరించుకుంటూ ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళభక్తులు, గ్రాపెద్దలు, ప్రజలు పాల్గొని గురు పౌర్ణమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

# గిద్దలూరు మండల అభివృద్ధికి కృషి చేస్తా

## ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 21)

గిద్దలూరు మండల అభివృద్ధి కార్యాలయంలో ఆదివారం సర్వసభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గిద్దలూరు మండలంలోని ప్రజా సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి చర్చించారు. గిద్దలూరు మండలంలో గతంలో ఎంతో అభివృద్ధి చేశానని, సీఎం నారా చంద్రబాబు నాయుడు సహాయ సహకారాలతో గిద్దలూరు మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మండలంలో సమస్యల పరిష్కారానికై అధికారులు తమ వంతుగా సహాయ ,సహకారాలు అందించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అధికారులను కోరారు. అలానే మండలంలో నీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మండల స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో గురు పౌర్ణమి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 21)

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానంలో వ్యాస పున్నమి, గురు పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన గురు పూజోత్సవ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన సన్మాన గ్రహీతలు కొండూరి కృష్ణమూర్తి దంపతులు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ఇనుగూరి సుబ్బరావుని దేవాలయ కమిటీ సభ్యులచే సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అడ్మినిస్ట్రేటర్ రఘురామిరెడ్డి , ఆలయ ప్రధాన కార్యదర్శి కొప్పరపు సత్యాలు, ఉపాధ్యక్షులు మాలకొండేశ్వరరావు, ట్రెజరర్ రామ సుబ్బయ్య, సహాయ కార్యదర్శి ఉప్పాల సుబ్బారావు, మారెళ్ల ఉమాకాంత్,పొట్టేళ్ల మాలకొండయ్య, ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు ఆలయంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని పరామర్శించిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం మున్సిపాల్టీ, జులై 21)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆదివారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కందుల నారాయణరెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తలు వహించి త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# ఒకే వీధిలో రెండు దొంగతనాలు



(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, జులై 21)

కంభం పట్టణంలోని సంగావీధిలో రహంతుల్లా అనే కొబ్బరి బొండాల వ్యాపారి ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న రెండు బీరువాలను పగులగొట్టి రెండు తులాల బంగారం, రూ.5 వేలు నగదును దుండగులు దోచుకు వెళ్లారు. అలాగే అదే వీధిలోని సతీష్ అనే యువకుడి పల్సర్ ద్విచక్ర వాహనం కూడా చోరికి గురైంది. శనివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేసుకుని క్లూస్ టీంను రంగంలోకి దింపి వేలిముద్రలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

# ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 21)

ఆషాధ గురు పూర్ణిమ బుద్ధుని ప్రప్రథమ ధర్మచక్రం ప్రవర్తనము సందర్భంగా ఈ నెల 21వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ప్రకాశం భవనం కలెక్టరు కార్యాలయం ఎదుట బౌద్ధ ధర్మ ప్రచార కేంద్రం వద్ద బుద్ధుని ధర్మ ప్రబోధ కార్యక్రమం జరిగింది. తొలుత బుద్ధునికి అతని ఐదుగురు శిష్యులకు పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా చుండూరు రంగారావు బుద్ధుని ధర్మంలో అభూత కల్పనలకు తావులేదని, సమాజంలో దుఃఖం ఉన్నదని, దుఃఖ నివారణకు అస్టాంగ మార్గం, పంచశీల, దశపారమితులు ఉన్నాయన్నారు. ప్రపంచానికి వెలుగు మార్గం చూపిన బుద్ధుని ధర్మం అనుసరణనీయమన్నారు. ఆ తర్వాత218 సంవత్సరాలకు రాజ్యాధికారానికి వచ్చిన బుద్ధుని మార్గంలో పరిపాలన చేసిన అశోకుడు బుద్ధుని ధర్మాన్ని ప్రపంచ వ్యాప్తి చేశాడన్నారు. ఒ.పిడి.ఆర్. రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర రావు మాట్లాడుతూ బుద్ధం శరణం గచ్చామి, ధర్మం శరణం గచ్చామి,సంఘం శరణం గచ్చామి అనే త్రికరణాలులను అందరి చేత పలికించారు. ప్రజలందరూ స్వేచ్ఛ సమానత్వంతో సోదరభావంతో బ్రతకాలని, అలా జీవించడానికి బుద్ధుని ధర్మమే అనుసరణీయమని దానినే డాక్టరు బీఅర్ అంబేద్కర్ ఆచరించమని చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, రిటైర్డ్ గజిటెడ్ ఆఫీసర్ల సంఘం నాయకులు ఏ సలార్, ఐ ఎల్ పి రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుందరం, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి ఎం.జార్జి, సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, బహుజన సామాజిక రచయిత రెబ్బవరపు ఉదయ కుమార్, మెడికల్ ఎంప్లాయిస్ నాయకులు కొండేపి నాగేశ్వరరావు, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు ధరణికోట లక్ష్మీనారాయణ, బౌద్ధ ధర్మ ప్రచార కేంద్రం నాయకులు అర్జా లక్ష్మి ప్రసాద్, సామాజిక రచయిత పిన్నిక శ్రీనివాసరావు, జై భీమ్ సేవాదళ్ నాయకులు జాలాది మోహన్, కార్మిక నాయకులు వి.శివరావు, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు జే సుబ్బారావు, నరసింహారావు, రెడ్ స్టార్ నాయకులు కొమ్ము రాజేంద్ర, తదితర సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గల్లీ గ్యాంగ్ స్టర్ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథులుగా జనసేన నాయకులు గునుకుల కిషోర్, అమరావతి కృష్ణారెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 21)

నెల్లూరు వాసి కొండిపోగు వెంకటేష్ దర్శకత్వంలో రూపొంది ఈ నెల 26వ తేదీన రైన్,సిరీ థియేటర్స్ లో విడుదల అవనున్న గల్లీ గ్యాంగ్ స్టర్స్ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ నెల్లూరు సినిమా అసోసియేషన్, ఇస్కాన్ సిటీ నందు ప్రముఖ మీడియా నిర్వాహకుడు రెమో ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళామతల్లి ముద్దుబిడ్డ అమరావతి కృష్ణారెడ్డి, జనసేన నాయకులు గునుకుల కిషోర్ తో పాటు పలువురు పాల్గొన్నారు. ఎంతో కష్టపడి వ్య ప్రయాసలకు ఓర్చి ఈ సినిమా నిర్మాణం జరిగింది.. డైరెక్టర్గా తనను తాను ప్రూవ్ చేసుకునేందుకు సహకరించిన నిర్మాతలకు, స్నేహితులకు పేరుపేరునా అభినందనలు తెలియజేశారు. సినిమా ప్రోత్సాహానికై పలువురు ఈ సినిమా కొన్ని షోల టికెట్లను కొనుగోలు చేసి టీం ను ప్రోత్సహించారు. గునుకుల కిషోర్ మాట్లాడుతూ కృషి తో నాస్తి దుర్భిక్షం.. కష్టపడి పనిచేస్తే ఫలితం తానంతట అదే వస్తుంది. కష్టపడి ఈ సినిమాను రూపొందించిన నటీనటులకు అభినందనలు తెలుపుతూ.. ఈ సినిమా విజయవంతం అయిన తరువాత సక్సెస్ మీట్ లో అందరం కలిసి వేడుక చేసుకోవాలి. కళారంగం మీద అభిమానంతో ప్రతి ఒక్కరిని వెన్ను తట్టి ప్రోత్సహిస్తున్న అమరావతి కృష్ణారెడ్డిని ప్రశంసించారు. యువత స్వయం ఉపాధి కింద సినిమా రంగాన్ని కూడా ఎంచుకోవచ్చు అని వారికి సహాయకారిగా ఉంటూ అన్ని కళారంగాలకు ఆర్థికంగా సహాయం చేస్తూ వెన్నుదన్నుగా నిలబడుతున్న అమరావతి కృష్ణారెడ్డి అభినందనీయులు. వారు కోరినట్లుగా చిన్న పరిశ్రమగా రిలీజ్‌కి అవంతరాలనూ, కళారంగం ఎదుర్కొంటున్న సమస్యలను పెద్దలు వేములపాటి అజయ్‌కు తెలిపి సినిమాటోగ్రఫీ మంత్రి జనసేన నాయకులు కందుల దుర్గేష్‌తో కలిసే విధంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కృష్ణ రెడ్డి మాట్లాడుతూ కళా రంగం అంటే తనకెంతో ఇష్టమని, కొంతమంది తాను రాజకీయంగా ఎదుగేందుకు కళారంగాన్ని ప్రోత్సహిస్తున్నారనుకుంటారు.కానీ తనకి రాజకీయం అంటే ఇంట్రెస్ట్ లేదు. 24 కలలో కష్టపడుతున్న కళాకారులను ప్రోత్సహించడమే తన కాంక్ష అని, చిన్న పరిశ్రమ ఎదుర్కొన్న సమస్యలను జనసేన నాయకులు ఇతర దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.




# గుంతలను పూడ్చేందుకు సహకారం



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జులై 21)

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి గౌరవార్థం హనుమంతునిపాడు ఎంపీటీసీ ఉడుముల వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కనిగిరి ఇటుకల వ్యాపారి మాబు సాహెబ్ ఆర్థిక సహకరంతో కనిగిరి – హనుమంతునిపాడు ఆర్అండ్ బీలోని గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ రోడ్డులో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందుల్ని గమనించి శాసనసభ్యుల వారి సూచన మేరకు ఈ కార్యక్రమాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంటా ఆదినారాయణ రెడ్డి, కత్తి తిరుపాలు, ఉపసర్పంచ్ కత్తి కిషోర్, గంట అరునాథ్, గోన ఇర్మియా పాల్గొన్నారు.

# రెండు బైకులు ఢీ ముగ్గురికి తీవ్రగాయాలు





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 21)

ప్రకాశం జిల్లా పొదిలి టైలర్స్ కాలనీ సమీపంలో ఎదురుగా వస్తున్న ఇరు బైకులు ఢీ కొని ముగ్గరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ ముగ్గరు కాటూరివారిపాలెం గ్రామానికి చెందినవారు. పయ్యావుల మల్లిఖార్జున్ అనే యువకుడు హెచ్.పి పెట్రోల్ బంక్‌లో పనిముగించుకుని తిరిగి స్వగ్రామం వెళ్ళే క్రమంలో సంఘటన జరిగింది. మల్లిఖార్జున్ పరిస్థితి తీవ్రంగా ఉండటంతో అత్యవసర చికిత్సకై ఒంగోలు తరలించారు. గాయపడ్డవారిలో దంటు చంద్ర, పల్లపు శ్రీకాంత్ ఉన్నారు. వీరికి ప్రస్తుతం పొదిలి ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స చేస్తున్నారు.

# ప్రత్యేక పూజల్లో కందుల విగ్నేష్





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 21)

గురు పౌర్ణమి సందర్భంగా పొదిలి పట్టణంలోని విశ్వనాథపురంలో సాయిబాబా ఆలయంతో పాటు దర్శి రోడ్డులో గల సాయిబాబా ఆలయంలో షిరిడి సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు మేళతాళాలు, ఆలయ మర్యాదలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# రామస్వామిపాలెంలో ఉచిత వైద్యం



(షణ్ముఖ వెలుగు, బోగోలు, జులై 21)

మండలంలోని రామస్వామిపాలెంలోని శ్రీ విష్ణుశ్వర శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం (శివాలయం) ప్రాంగణంలో ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్, జై భీమ్అంబేద్కర్ సేవాదళ్ ఆధ్వర్యంలో బిందు మీనన్ ఫౌండేషన్ డాక్టర్ బిందు మీనన్ వారి బృందంతో కలసి ఉచిత వైద్యం అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ గండూరి మంజుల, అంబేద్కర్ సేవాదళ్ అధ్యక్షుడు బత్తుల రవిచంద్ర, ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ డిస్టిక్ చీఫ్ దాసరి సునీల్, సెక్రటరీ ఎస్.కె నూరుద్దీన్, ఆఫీస్ సెక్రటరీ మల్లీ సురేష్, అరిజినల్ సెక్రటరీ దాసరి తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా గురుపూర్ణమి వేడుకలు



(షణ్ముఖ వెలుగు, నాయుడుపేట, జులై 21)

నాయుడుపేట పట్టణంలోని అగ్రహారపేటలో వెలిసి ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో ఆదివారం గురు పూర్ణమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచి శ్రీ సాయిబాబా వారి మేలుకొలుపు, కాకడ హారతి,పాలాభిషేకం,శ్రీ సాయి సహస్రనామ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు గురు పూర్ణిమ ఉత్సవంలో పాల్గొని శ్రీ సాయినాధుని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షులు దాసరి ప్రభాకర్ నాయుడు, కార్యదర్శి సిహెచ్ శ్రీధర్ కుమార్, కోశాధికారి పూనాటి తిరుమల నాయుడు, కమిటీ సభ్యులు ఎం.ముత్యాల రెడ్డి, టి.జయచంద్రారెడ్డి ఇ. సిద్ధార్ధన, ఎం చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## గిద్దలూరు మండల విలేకరుల నూతన కార్యవర్గం



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 21)

గిద్దలూరు మండల విలేకరుల నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నాయబ్ రసూల్, అధ్యక్షుడిగా జగన్నాథరెడ్డి, ఉపాధ్యక్షులుగా వై శివ కోటేశ్వరరావు, కే సుధీర్ కుమార్, కే జనార్దన్ రెడ్డి, శివాపురం మురళి, ప్రధాన కార్యదర్శులుగా ఎం రాజ్ కుమార్, ఎం నెమలిగుండం, కే అంకయ్య, సిహెచ్ మున్నా, ట్రెజరర్స్ వేములపాటి శేఖర్, ఎం గిరి, గౌరవ సలహాదారులు గా ఎస్వీ కృష్ణారావు, మల్లికార్జున స్వామి లను ఎన్నుకున్నారు.

## అవినీతి కార్యదర్శిపై చర్యలు ఉండవా?

రాజకీయ అండండలు ఉంటే నీతిపరుడవుతాడా?

సమగ్ర విచారణ చేపట్టి క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలి

గ్రామ పంచాయితీని కాపాడాలి

జిల్లా కలెక్టర్‌కి విన్నవించి చర్యలకు డిమాండ్ చేసిన ఫిర్యాదుదారుడు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 21)

మేజర్ గ్రామ పంచాయితీ లో అవినీతికి అక్రమాలకు పాల్పడిన గ్రామ పంచాయితీ కార్యదర్శిపై ఆరోపణలు వచ్చినా మీడియా గగ్గోలు పెట్టినా కనీస శాఖ పరమైన చర్యలు లేకపోవడం పై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు దారుడు కోరారు. సింగరాయకొండ గ్రామ పంచాయితీలో కొంత కాలంగా ప్రజలకు సంబంధించి ఇంటి పన్నులు ఇతర ఆర్థిక లావాదేవీలు బిల్ కలెక్టర్ల మొబైల్ ద్వారా డబ్బు వసూలు చేస్తూ వాటిని తిరిగి తన ఖాతాకు చేరే విధంగా అవినీతికి పాల్పడి 80 వేలకు పైగా సొమ్ము చేసుకున్నాడని వార్తలు ప్రచురితమయ్యాయి. అవినీతికి పాల్పడిన సింగరాయకొండ గ్రామ పంచాయితీ కార్య దర్శి పై ఇటీవల విచారణ చేపట్టిన జిల్లా పంచాయితీ అధికారి దృష్టికి తీసుకు వెళ్లేందుకు ప్రయత్నం చేస్తే దాన్ని పట్టించుకోలేదని దాంతో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు రావడం జరిగిందని ఫిర్యాదు దారుడు పేర్కొన్నాడు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను సానుకూలంగా విన్న కలెక్టర్ ఫిర్యాదు దారుడు జత చేసిన సమాచారాన్ని పరిశీలించారు. సింగరాయకొండ గ్రామ పంచాయతీలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వానికి, గ్రామం పంచాయితీ అప్రదిష్ట పాలు కావడానికి కారకులైన పంచాయితీ కార్యదర్శిపై శాఖా పరమైన చర్యల తోపాటు అక్రమంగా ప్రజల నుంచి వసూలు చెందిన అవినీతి సొమ్మును రాబట్టాలని కోరాడు. సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకుంటామని ఫిర్యాదుదారుడికి హామీ ఇచ్చారు.

# సంషీర్ అహ్మద్ స్మారక సమితి ఏర్పాటు అభినందనీయం

సంషీర్ అహ్మద్ స్మారక సమితి ఆవిర్భావ పత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 21)

నిబద్ధ ప్రభుత్వ అధికారి సంషీర్ అహ్మద్ స్మారక సమితి ఏర్పాటు అభినందనీయమని ప్రజానాట్య మండలి గౌరవ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులో సంషీర్ అహ్మద్ స్మారక సమితి ఆవిర్భావ సభ జరిగింది. ఈ మేరకు ముఖ్య అతిథులుగా రిటైర్డ్ స్పెషల్ కలెక్టర్ ఐ. వెంకటేశ్వర రెడ్డి, నల్లూరి వెంకటేశ్వర్లు పాల్గొని స్మారక సమితి ఆవిర్భావ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీతికి నిజాయితీకి మారుపేరుగా సంషీర్ అహ్మద్ నిలిచారని అన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే వారని అన్నారు. స్మారక సమితి సమితి అధ్యక్షులు షబ్బీర్ అన్నాద్ మాట్లాడుతూ సంషీర్ అహ్మద్ ఆశయాల మేరకు స్మారక సమితి పని చేస్తుందని అన్నారు. ప్రజలందరూ ఉన్నతంగా జీవించాలనే సమున్నత కలలు గల ఆయన ఆశయాలను నెరవేర్చేందుకు సమితి పనిచేస్తుందని అన్నారు. సమాజంలోని పేదల పట్ల బాధ్యత కలిగిన వ్యక్తిగా భావితరాలకు ఆదర్శప్రాయుడిగా సంషీర్ అహ్మద్ నిర్వహించిన పాత్ర అనితర సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమానికి సమితి ఉపాధ్యక్షుడు వైయస్ దిగ్విజయ్ సంచాలకులుగా వ్యవహరించగా, కార్యవర్గ సభ్యులు జియర్, ఎస్ డి. సర్దార్, నబీ కే ఖాన్, జమీర్, నజీర్, జిలాని భాష, జహీర్, ఏఐటియుసి నాయకులు పివిఆర్ చౌదరి, ఉప్పుటూరి ప్రకాశరావు, వివిధ ప్రజా సంఘాలకు చెందిన ప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ లీగల్ సెల్ పటిష్టం

వారు సపోర్ట్‌గా ఉన్నారన్న ధైర్యంతో ఎన్నో ప్రజా పోరాటాలు చేశాం
వకీల్ సాబ్‌లకు సమాజంలో ఉన్నత స్థాయి ఉంది
సమాజంపై బాధ్యత కలిగిన వారిని జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వంలో చేర్చండి
గునుకుల కిషోర్

రాష్ట్రంలో మేధావి వర్గాలు జనసేన వైపు
నీతికి, నిజాయితీకి కట్టుబడి ఉండే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
అలాంటి గొప్ప వ్యక్తి అడుగుజాడల్లో నడవడం అదృష్టంగా భావిస్తున్నాం
సభ్యత్వ నమోదులో నెల్లూరు జనసేన రికార్డు సాధించాలి
జనసేన పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు చదలవాడ రాజేష్

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 21)



రాష్ట్రంలో మేధావి వర్గాలన్నీ జనసేన పార్టీ వైపు చూస్తున్నాయని ఆ పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు చదలవాడ రాజేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక గోమతి నగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో చదలవాడ రాజేష్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో జనసేన పార్టీ ప్రభంజనం సృష్టించిందని తెలిపారు. జననేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై ప్రజలకు సంపూర్ణమైన విశ్వాసం ఉందని రుజువైందన్నారు. భవిష్యత్తు తరాలకు పవన్ కళ్యాణ్ ఒక రోల్ మోడల్ అని వ్యాఖ్యానించారు. పేద ప్రజల ఆశాజ్యోతి పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నీ నిజాయితీకి కట్టుబడి ఉండే డిప్యూటీ సీఎం భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లాలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రికార్డు స్థాయిలో చేపట్టాలని పిలుపునిచ్చారు. పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తూ సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఆయన దిశ నిర్దేశం చేశారు. జనసేన పార్టీ కోర్ కమిటీ సభ్యుడు, సీనియర్ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా క్షేత్రస్థాయిలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు, సభ్యత్వ నమోదు కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గునుకుల కిషోర్, న్యాయవాదులు శరత్, శ్రీరామ్, గురు కుమారు, చిరంజీవి, మధు, సుభాషిని, ఆరతి , జమున రాణి, గోపాల్, ప్రసాద్, కిరణ్ కుమార్ ,రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన అండర్ 11 చెస్ పోటీలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 21)

ప్రకాశం జిల్లా చదరంగ సమాఖ్య కార్యదర్శి షేక్. అబ్దుర్ నజ్గా ఆధ్వర్యంలో ఆదివారం స్థానికలోని ఐకాన్ గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో బాలుర కేటగిరిలో మెదటి స్థానంలో ఒత్తిన అభినందన్, రెండో స్థానంలో సృజన్, మామిత్, బాలికల కేటగిరిలో మొదటి స్థానంలో సాయి రెష్ట, రెండో స్థానంలో లాస్య శ్రీప్రియు విజేతలుగా నిలిచారు. వీరు ఈ నెల 27, 28, నభీమవరంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రకాశం జిల్లా తరఫు నుంచి పాల్గొంటారని ఆర్బిదర్ సుకాంత్ తెలిపారు. ఐ కాన్ గ్లోబల్ స్కూలు తరఫు నుంచి ప్రిన్సిపాలు కాపా చిరంజీవి మాట్లాడుతూ జిల్లా నుంచి వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో ఐ కాన్ గ్లోబల్ స్కూల్ విద్యార్థి అభినందన్ మెదటి స్థానంలో నిలవడం చాలా ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

## చదవడం మాకిష్టం కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 21)

మండల పరిధిలోని ఉలవపాడు , చాకిచర్ల శాఖా గ్రంధాలయాలలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాలు నిర్వహించినట్లు గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థుల చేత నీతి కథలు చదివించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. నీతికథల పుస్తకాలు చదవడం వల్ల మంచి భావనలు మనస్సులో పెరుగుతాయని, మంచి జ్ఞానం పెరుగుతుందన్నారు. ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చిన తరువాత ఏ విషయమైనా గూగుల్లో సెర్చ్ చేస్తే సులభంగా దొరుకుతుందన్నారు. కానీ పుస్తకం చదవడం వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు ఎంతో అర్థమయ్యేలా గ్రంథాలయ పాలకులైన కోటేశ్వరరావు పిల్లలకు ఎంతో చక్కగా తెలిపారు.

# కోమటిగుంట్ల చెన్నయ్య సేవలు మరువలేనివి

మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 21)

మదర్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ ఆర్ఎంపీ వైద్యులు కీ.శే కోమటిగుంట్ల చెన్నయ్య సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. కోమటిగుంట్ల చెన్నయ్య ద్వితీయ వర్ధంతి సభ కనిగిరిలోని స్థానిక విజేత ఐఐటీ, నీట్ అకాడమీ నందు జరిగింది. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ అతి సామాన్యమైన కుటుంబలో పుట్టి ఆర్ఎంపీ వైద్యునిగా జీవనం సాగిస్తూ తన సేవా కార్యక్రమంల ద్వారా ప్రజలందరి మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి కోమటిగుంట్ల చెన్నయ్య అని తెలిపారు. కనిగిరి లో నిరుపేదలు నివసించే అన్ని ప్రాంతాల్లో అన్నదానాలు మదర్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యక్తి అని తెలిపారు. మదర్ సేవా సమితి గౌరవ అధ్యక్షులు సయ్యద్ యాసిన్ మాట్లాడుతూ కరోనా కాలంలో ప్రతి ఒక్కరి కి వైద్య సేవలు అందించిన వ్యక్తి చెన్నయ్య అన్నారు. తన సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలందరికీ దగ్గర అయ్యారని తెలిపారు. ఇస్కాన్ సభ్యులు గుత్తి శ్రీధర్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి వయసుతో సంబంధం లేదని, తమకున్న దంట్లో కొంత సేవా కార్యక్రమాలకు ఉపయోగపడడం ద్వారా భగవంతునికి దగ్గరవ్వ వచ్చని తెలిపారు.మంటిసరీ స్కూల్ కరస్పాండంట్ పిచ్చి రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల మధ్య నిర్వహించడం ద్వారా వారి లో కూడా సేవా గుణాలు అలవడతాయాని తెలిపారు. మదర్ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. ఎన్ రసూల్, పసుపులేటి అరుణోధర్‌లు మాట్లాడుతూ చెన్నయ్య భౌతికంగా మన మధ్య లేనప్పటికి వారి ఆశయాలు ను మదర్ సేవా సమితి రూపం లో కొనసాగుతూనే వుంటాయని తెలిపారు. మదర్ సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానాలు, దుప్పట్లు పంచడం, నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు, ఫీజులు వంటి ఆర్ధిక సహాయం అందించడం, అనారోగ్య పరిస్థితి లో వున్న నిరుపేదలకు వైద్య సహాయం అందించడం వంటి కార్యక్రమం లు నిరంతరం జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు మదర్ సేవా సమితి సభ్యులు వాగిచర్ల వెంకటేశ్వర్లు గారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు సహాయమ్ చేయడం లో తనకు ఎంతో సంతోషం ఉంటుందని తెలిపారు. తన వంతుగా రూ.8000ను ఇద్దరు విద్యార్థులు కు పుస్తకాల నిమిత్తం అందించారు. అలాగే మదర్ సేవా సమితి సభ్యులు కోమటిగుంట్ల శ్రీను,



బేరి భాస్కర్ రెడ్డి మరో ఇద్దరు విద్యార్థులకు 10 వేల రూపాయల విలువైయినా బుక్స్‌ను అందించారు. అలాగే విద్యార్థులు, హాజరైన వారికి ఈర్ల విజయరామరాజు కంటు గురయ్య ఆర్.ఎం.పి డాక్టర్ షేక్ హుస్సేన్ ఆర్థిక సాయంతో అల్పాహారం అందించారు. హాజరైన మదర్ సేవా సమితి సభ్యులందరు చెన్నయ్య తో అనుబంధాన్ని, వారి సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యులు పీర్ల మస్తాన్ వలి,, వాగిచర్ల వెంకటేశ్వర్లు, ఆర్ఎంపీ ద్రోనాధుల చెంచులు,మాజీ ఏఎంసీ డైరెక్టర్ బొట్టు శ్రీను ఆర్ఎంపీ పచ్చవా శేఖర్, ఈర్ల విజయరామరాజు, ఎల్ఐసీ నారాయణ కంటూ గురవయ్య, ఈర్ల గురవయ్య, కోమటిగుంట్ల శ్రీను, చెరుకూరి కాశయ్య మానస జిరాక్స్ రవి, రంగబాబు ,షేక్ అబ్దుల్ సమ్మద్ పాల్గొన్నారు.

# పిటిపి కంపెనీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్నిక



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 21)

మండల పరిధిలోని కరేడు ర్యాంపు వద్ద హెూటల్‌లో ఆదివారం పిటిపి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. ఈ మీటింగ్ కి చిమట శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు జీవీబీ కుమార్ పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ గత పది యేండ్ల లో బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గాన్ని తీవ్రంగా అణిచివేసేందుకు ప్రయత్నం చేసింది. కార్పొరేట్ల కు కొమ్ము కాస్తూ కార్మిక వర్గ హక్కులను హరించింది. నిరంకుశంగా వ్యవహరించింది. ప్రజల మధ్య వైష మ్యాలను పెంచి పోషించింది. అందుకనే పార్లమెంట్ ఎన్నికలలో బిజెపికి ఓట్లు, సీట్లు తగ్గాయి. రాష్ట్రంలో వైఎస్ఆర్ ప్రభుత్వం కనీస వేతనం,కరువు భత్యం, అసంఘటితంగా కార్మికుల సంక్షేమం గురించి సక్రమంగా పట్టించుకోలేదు.కార్మిక ఉద్యమాల పట్ల అహంకారపూరితంగా వ్యవహరించింది.ఫలితంగా రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారు. మేము అధికారంలోకి వస్తే అసంఘటితంగా అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమం,భద్రత కల్పిస్తాము. కనీస వేతనాలు అమలు చేస్తాము. ఒకటవ తేదీనే వేతనాలు చెల్లిస్తాము. కార్మిక ఉద్యమాల పట్ల ప్రజాస్వామ్యపద్ధతి లో వ్యవహరిస్తామని చెప్పారు. అలా కాకుండా కేంద్ర,,రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు పెద్దపీట వేసి ప్రైవేటీకరణ విధానాలను అమలు చేస్తే ఉద్యమాలు తప్పవని జీవీబీ కుమార్ అన్నారు. ఆగస్టు 16,17, 18 తేదీలలో నెల్లూరులో సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ మీటింగ్ జరుగుతుందని, 16వ తేదీన నర్తకి సెంటర్ లో జరిగే బహిరంగ సభకు కార్మికులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. అనంతరం పిటిపి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా సవరం శ్రీనివాసులు, కార్యదర్శిగా గంజి శ్రీను వాసులు, కోశాధికారిగా చిలకా శ్రీను వాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా పి మస్తాన్ బి, ఉపాధ్యక్షులుగా ఆర్ సుబ్బరామయ్య, సహాయ కార్యదర్శులు గా యు. వెంకటసుబ్బయ్య, కే మహేశ్వరరావు లు ఎన్నికవ్వగా కమిటీ సభ్యులుగా కండ్లగుంట వెంకటరావు, మద్దసాని రాజ్యం తోపాటు మరో ఐదు మందిని ఎన్నుకున్నారు. ఫ్యాక్టరీలో ఆదివారం డ్యూటీ చేయాలనే యాజమాన్య నిబంధనను వ్యతిరేకించారు. ఈ సమావేశంలో సిఐటియు ఉలవపాడు మండల నాయకులు చీమటా.శ్రీనివాసులు, మాజీ ఆఫీస్ బేరర్ సిహెచ్ కోటేశ్వరరావు తోపాటు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏడో రోజుకు చేరుకున్న ఏపీపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ నిరాహార దీక్షలు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 21)

పొదిలి డిపోలో యాజమాన్యం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక కక్ష సాధింపు చర్యలకు నిరసనగా ఏపీపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ తలపెట్టిన ఏడో రోజు నిరాహార దీక్షలు బి రోషన్ కుమార్ ఆధ్వర్యంలో నిరాహార దీక్షకు కే పి బాబు డ్రైవర్ ఈ నం. 627092, సిహెచ్చి సి ఎస్ బాబు డ్రైవర్ ఈనం. 627481లను కొండలు, మాజీ సిసిఎస్ డెలిగేట్, ఎస్ వెంకటేశ్వర్లు, ఏ డి సి జోనల్ నాయకులు పూలమాలవేసి దీక్ష శిబిరంలో నిరాహార దీక్షలో కూర్చోబెట్టినారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ డీఎం ఎంప్లాయిస్ యూనియన్ నాయకులను తో చర్చలు జరిపి చార్టులు వరకే నా పరిధిలో ఉన్నాయి. మిగతావన్నీ ఆర్ఎం దృష్టికి తీసుకెళ్తానని చార్టులు వెంటనే వేస్తానని హామీ ఇచ్చారని, మిగతా సమస్యలన్నీ కూడా పరిష్కారం చేసేంతవరకు ఈ నిరాహార దీక్షలు కొనసాగిస్తామన్నారు. ఎక్సెస్ పేరుపై కనిగిరి డిపోకు రిలీవింగ్ పై పంపిన డ్రైవర్లను వెంటనే మాతృ డిపోకి తెప్పించి లీవ్ పొజిషన్ కల్పించాలి. సకాలంలో ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్లు కలిపేలా చర్యలు తీసుకోవాలి. డిస్పాచ్ మెకానిక్ కృష్ణ డ్రైవర్లపై పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నాడని అతనిపై చర్యలు తీసుకొని వెంటనే డిస్పాచ్ మెకానిక్ ను వెంటనే మార్చాలని తెలిపారు. అహర్నిశలు శ్రమ పడుతూ సంస్థకు ఆర్థిక వనరులు సమకూరుస్తున్న ఉద్యోగులను నిబంధనకు విరుద్ధంగా చిన్న చిన్న పొరపాటులకు 1/ 2019 సర్క్యులర్‌ను అమలు చేయకుండా డీఎం ఇష్ట ప్రకారం పనిష్మెంట్ ఇస్తూ అయినవారికి ఆకులో కాని వారికి కంచంలో అన్న చందంలో పనిష్మెంట్లు ఇస్తూ ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తూ ఆర్థిక నష్టం కల్పిస్తున్నారు. కానీ అక్రమ మాస్టర్లు ఇచ్చి సంస్థకు ఆర్థిక నష్టం కల్పిస్తున్న ఎస్ టి ఐపై ఎటువంటి చర్యలు లేవన్నారు. ఏ యం టి కార్యాలయంనందు హెయిర్ బస్ లకు సంబంధించిన ఎస్పార్లు పోతే ఇప్పటివరకు అధికారులు స్పందించలేదు. పై విషయాలపై ఆర్ ఎం దృష్టికి తీసుకెళ్లిన సూపర్వైజర్లపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. మా సమస్యలు పరిష్కరించేంత వరకు ఈ రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని తెలిపారు.

# ముగిసిన ప్రపంచ కమ్మ మహాసభ

**హాజరైన సినీ ప్రముఖులు,**

**వివిధ రాష్ట్రాల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు**









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 21)

కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కేజీఎఫ్) ఆధ్వర్యంలో హైదరాబాదులోని హైటెక్స్‌లో ప్రపంచ కమ్మ మహాసభ రెండు రోజులు కార్యక్రమం ఆదివారం ప్రముఖుల ప్రసంగాలతో ముగిసింది. ఈ కార్యక్రమంలో మహాసభ తీర్మానాలను ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా ఐటి నిపుణులు, అగ్రికల్చర్ నిపునుండు తో ఇష్టా గోష్ఠి జరిగింది. ఈ కార్యక్రమంలో సినీ దర్శకులు రాజమౌళి తండ్రి సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్, తెలంగాణ, ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రపంచ కమ్మ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు జెట్టి కుసుమకుమార్ను ప్రకాశం జిల్లా ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా బాపయ్య చౌదరిని, అధ్యక్షులు అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రావుల పద్మజ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అసరా వృద్ధాశ్రమం వ్యవస్థాపకులు చెడిపోతు వెంకటేశ్వర్లు, కాట్రగడ్డ రఘు, మండవ మురళీకృష్ణ, బొద్దులూరి ఆంజనేయులు, డాక్టర్ శ్రీమన్నారాయణ తిరుపతి స్వామి, అంజలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అందరి సహకారంతోనే రొట్టెల పండుగ విజయవంతం

- వచ్చే ఏడాది మరింత ఘనంగా రొట్టెల పండుగ
- రొట్టెల పండుగ విజయవంతంలో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ పారిశుధ్య కార్మికులు
- దర్గా అభివృద్ధికి ఐదు కోట్ల కేటాయించిన ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు
- రొట్టెల పండుగ ముగింపు సభలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 21)

అందరి సహకారంతోనే బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ విజయవంతమైందని, సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం దర్గా ఆవరణలోని ఏపీ టూరిజం పార్కు ఆవరణలో దర్గా ఫెస్టివల్ కమిటీ ఆధ్వర్యంలో రొట్టెల పండుగ ముగింపు సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దర్గా కమిటీ సభ్యులు అందరి సహకారం తోనే రొట్టెల పండుగలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా విజయవం తమైందన్నారు. సోమవారం, మంగళవారం కూడా దర్గాలో అధికారులు ఇదేవిధంగా భక్తులకు సేవలు అందించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తపనతో పనిచేశారని, కమిటీ సభ్యులు ఎంతో నిబద్ధతతో భక్తులకు సేవలు అందించారని ప్రత్యేకంగా అభినందించారు. వచ్చే సంవత్సరం మరింత ఘనంగా రొట్టెల పండుగను నిర్వహిస్తామన్నారు. బారాషహీద్ దర్గా అభివృద్ధి కి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ. 5 కోట్లు కేటాయించడం పట్ల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మత పెద్దలు, అధికారుల సూచనల మేరకు మాజీ మేయర్ అజీజ్ ఆధ్వర్యంలో ఈ నిధులతో మసీదు నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు.

**రొట్టెల పండుగ విజయవంతంలో**
**మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ పారిశుద్ధ కార్మికులు**

రొట్టెల పండగ ఇంత ఘనంగా జరగడానికి అందరూ సమష్టిగా పని చేస్తే, పండగ విజయవంతంలో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ మాత్రం పారిశుధ్య కార్మికులేనని, వారి సేవలు అమోఘం, అద్భుతమని ప్రత్యేకంగా ఎమ్మెల్యే కొనియాడారు. వారి కష్టం, శ్రమకు అందరి తరపున ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రొట్టెల పండుగలో ఐదు రోజులపాటు విశిష్ట సేవలందించిన వివిధ విభాగాల అధికారులను, సిబ్బందిని, దర్గా కమిటీ సభ్యులను పాత్రికేయులను మెమోంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ చైర్మన్ ఖాదర్ భాష, ఎఎస్పీ శ్రీనివాసరెడ్డి, అడిషనల్ కమిషనర్ శర్మద, సిటీ ప్లానర్ దేవీకుమారి, హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, మాజీ మేయర్ అజీజ్, కార్పొరేషన్ అధికారులు, దర్గా కమిటీ సభ్యులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సతీమణికి జనసేన నేతల శుభాకాంక్షలు

(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, జులై 21)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి కె.పవన్ కళ్యాణ్ సతీమణి ఆనాకి ప్రత్యేకంగా సింగరాయకొండ మండల జనసేన పార్టీ అధ్యక్షుడు అయినా బత్తిన రాజేష్ ప్రత్యేకంగా సింగరాయకొండ జనసేన పార్టీ తరపున ప్రత్యేకంగా ఆనాకి శుభాకాంక్షలు తెలిపారు. సింగపూర్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందారని ఆయన తెలిపారు. ఆనాకి ఇది రెండు మాస్టర్స్ డిగ్రీ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌లో అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించిన స్నాతకోత్సవములో ఆనా విజయవంతంగా పట్టా స్వీకరించారు. ఆగ్నేయాసియా దేశాల కలలు సామాజిక విజ్ఞానం (ఆర్ట్స్ సోషల్ సైన్సెస్)లో ఆమె ఈ మాస్టర్స్ చేశారని సింగరాయకొండ మండల జనసేన పార్టీ అధ్యక్షుడు అయినా బత్తిన రాజేష్ తెలిపారు ఆనా పట్టా పొందిన సందర్భంగా ఆంధ్ర రాష్ట్ర ప్రజలే కాకుండా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ప్రజలు కూడా ప్రత్యేకంగా ఆనాపట్ల శుభాకాంక్షలు తెలియ జేస్తున్నారని అయినా బత్తిన రాజేష్ ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. ఆనా కొణిదెల రష్యా లోని సెయింట్ పీటర్స్ బర్గ్ స్టేట్ యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేశారని రాజేష్ తెలిపారు అక్కడ ఓరియంటల్ స్టడీస్ లో హెూ నర్స్ ఆనా పట్టా పొందినారు అని రాజేష్ అన్నారు ఇదే గాక ఆసియా దేశాల చరిత్ర భాషలు జీవన విధి విధానంపై అధ్యయనంలో థాయిలాండ్ చరిత్ర ఒక ప్రత్యేక సబ్జెక్టుగా ఉందన్నారు. సెయింట్ పీటర్స్ బర్గ్ స్టేట్ యూనివర్సిటీలో ఉండగానే మూడు భాషలు కూడా ఆమె నేర్చుకున్నారని ఈ సందర్భంగా అయిన బత్తిన రాజేష్ పార్టీ తరపున సంతోషం వ్యక్తం చేశారు. ఆ తర్వాత బ్యాంకాక్‌లోని చులాల్ లాంగ్ కార్న్ యూనివర్సిటీ నుంచి దాయి విద్యారంగంలో ఎంతో కష్టపడి పట్టుదలతో కృత నిశ్చయముతో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఆనామాస్టర్స్ డిగ్రీ విజయం సాధించారని సింగరాయకొండ మండల జనసేన పార్టీ అధ్యక్షుడు అయినా బత్తిన రాజేష్ సింగరాయకొండ మండల జనసేన పార్టీ సైనికుల తరపున ప్రత్యేకంగా ఆనాకి శుభాకాంక్షలు తెలిపారు. ఏది ఏమైనా పనికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ సతీమణి ఆనాకు డిగ్రీ పట్టా పొందిన శుభ సందర్భంగా సింగరాయకొండ మండల జనసేన పార్టీ తరపున మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సీనియర్ నాయకుడు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సీనియర్ నాయకుడు బత్తిన రాజేష్ ఆదివారం జన సైనికుల తరపున ఒక ప్రకటనలో తెలిపారు.

# ఇక్కడ ప్రజలు బురదల్లో నడవక తప్పదు

**ప్రశ్నించేవారు లేకే ఎస్సీ పాలెం పై చిన్నచూపు చూపుతున్న అధికారులు**



(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జులై 21)

పుల్లలచెరువు మండలం పుల్లలచెరువు గ్రామ పంచాయతీలోని ఎస్సీ పాలెం అంటే అధికారులకి చిన్న చూపు అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇక్కడ అంతా పేద, మధ్య తరగతి కుటుంబాలే. అసౌకర్యాల నడుమ జీవనం సాగిస్తున్నారు. ఎస్సీ పాలెం ఏర్పడి ఎన్నో దశాబ్దాలవుతున్నా.. ఇంత వరకు పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. వర్షాలు కురిసిన ప్రతిసారి మురుగు నీరు, బురద సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఇళ్ల ముందు నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. మురుగు కాలువలు లేక నీరు పారే మార్గంలేక ఇళ్ల ముందే నిలుస్తుంది. దీంతో రోజుల తరబడి నిల్చున్న నీటి వల్ల భరింపరాని కంపు కొడుతోంది. ఇక రాత్రిళ్లు మార్గంలో నడిచే వారికి నరకమే కనిపిస్తుంది. చాలా మంది ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఇక్కడ సిమెంట్ రోడ్లు కొన్ని చోట్ల ఉండి కొన్ని చోట్ల లేకపోవడంతో రోడ్లు బురదమయంగా మారి అడుగు తీసి వేయలేని పరిస్థితి ఏర్పడింది. కాలు మోపితే చాలు జనం జారి పడుతున్నారు. కొందరు చేసేదిలేక సొంతంగా మట్టి తెచ్చి పోసుకున్నా ఫలితం దక్కడం లేదు. ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వర్షం వస్తే అంతే....**

ఎస్సీ పాలెంలో వర్షం వస్తే అంతే సంగతులు. మురుగు కాల్వలు, రహదారులు లేవు. దీంతో నీరంతా ఇళ్ల ముందు నిలుస్తోంది. ఇకపై ప్రాంతాల నుంచి వచ్చే నీరు తోడై ఇబ్బంది వాతావరణం తలెత్తుతుంది. దీంతో ఆరుబయటకు రాలేని పరిస్థితి. నీరు తగ్గినా.. రోజుల తరబడి బురద కంపుతో బయట కూర్చోలేక పోతున్నారు. దీంతో ఇళ్లలోనే ఉండి పోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఎంత మంది వచ్చినా ఎవ్వరు సమస్య పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్షం వస్తే చాలు మా ఎస్సీ పాలెం వీధులు బురదమయంగా మారుతున్నాయి. చాలా చోట్ల కనీస మౌలిక వసతులు లేవు. మట్టితో వేసిన రోడ్డులో అడుగేస్తే జారి పడుతున్నారు. నీరు బయటకు పోయే మార్గం చూపి, సిమెంట్ రోడ్లు వేసి ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరుతున్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# బస్సు నడిపిన ఎమ్మెల్యే ఉగ్ర







(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 21)
ఎమ్మెల్యే ఉగ్ర బస్సు నడిపి ఆర్టీసి కార్మికులు, టీడీపీ శ్రేణుల్లో ఆనందం నింపారు. ఆదివారం కనిగిరి డిపోలో 5 నూతన ఆర్టీసి బస్సులను ఆయన ప్రారంభించారు. బస్సులను ప్రారంభించిన అనంతరం అల్ట్రా డీలక్స్ బస్సును ఆయన కొంత సేపు నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయంలో అగ్రస్థానంలో ఉండే కనిగిరి డిపో నుండి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించాలని అధికారులను కోరారు. ఆగష్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని ఇది మహిళలకు వరమన్నారు.

# పేదల సంక్షేమమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ధ్యేయం

## రైతు బజార్లలో రాయితీపై నిత్యవసర సరుకులు పంపిణీ మంత్రి డాక్టర్ బాల వీరాంజనేయస్వామి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 21)
పేద ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ద్వేయమని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా పేద ప్రజలకు రైతుబజార్లలో రాయితీపై నిత్యవసర సరుకులు అందిస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి ఆదివారం విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రాయితీపై నాణ్యమైన బియ్యం, కందిపప్పు పంపిణీ చేస్తున్నామని మంత్రి అన్నారు. ఏ-గ్రేడ్ కందిపప్పు కిలో రూ.160, రెండు రకాల నాణ్యమైన సోనా మసూరి బియ్యాన్ని కిలో రూ. 48 , రూ.49 కే ప్రజలకు అందిస్తున్నారు. ఒంగోలులోని 3 రైతు బజార్లతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోని రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు మంత్రి తెలిపారు. ఈ కౌంటర్లు ఉదయం 8 నుంచి సాయంత్రం 8 వరకు అందుబాటులో ఉంటాయని జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి కోరారు. వైసీపీ హయాంలో పెరిగిన నిత్యవసర ధరలతో పేదలు అర్ధాకలితో అలమటించారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో అడ్డూ అదుపు లేకుండా పెరిగిన ధరలు తగ్గించి పేదలకు ఊరట కలిగించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు కూడా ఏర్పాటు చేసి రూ.5 లకే పేదల ఆకలి తీరుస్తామని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# రైలు కింద పడి ఎల్ఐసి ఏజెంట్ ఆత్మహత్య




(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్ఛార్జి, జులై 21)
ఎల్ఐసి ఏజెంట్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మార్కాపురం రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం. ఎల్ఐసి ఏజెంట్‌గా పనిచేస్తున్న హమీద్ ఆదివారం రైల్వే స్టేషన్లోని ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ట్రైన్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. హమీద్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మార్కాపురం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా ఇద్దరు మృతి





## తిప్పాయపాలెం వద్ద ఘటన
## విజయవాడకు చెందిన బస్సు గేదెలను ఢీ కొట్టి బోల్తా
## అనంతపురం జిల్లా ధర్మవరంకు చెందిన వ్యక్తి మృతి
## కలనుతల గ్రామానికి చెందిన కుర్ర భూలక్ష్మిచికిత్స పొందుతూ మృతి
## ప్రమాదంలో ఏడు మందికి గాయాలు
## ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 32 మంది ప్రయాణికులు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్ఛార్జి, జులై 21)
మార్కాపురం మండలంలోని తిప్పాయపాలెం గ్రామానికి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై రహదారి దాటుతున్న గేదెలను ఢీ కొట్టిన విజయవాడకు చెందిన ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడిన సంఘటన చోటు చేసుకుంది. మార్కాపురం గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన శ్రీ వెంకట కనకదుర్గ ప్రైవేట్ ట్రావెల్స్ బస్ విజయవాడ నుంచి అనంతపురం కు 32 మంది ప్రయాణికులతో బయలుదేరింది. బస్సు ప్రకాశం జిల్లా మార్కాపురం మండలంలోని తిప్పాయపాలెం గ్రామ సమీపానికి ఆదివారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలోకి వచ్చేసరికి రహదారిపై దాటుతున్న గేదెలను బస్సు ఢీ కొట్టింది. దీంతో బస్సు అదుపుతప్పి రహదారి పక్కన పొలాల్లో పడిపోయింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే అనంతపురం జిల్లా ధర్మవరం గ్రామానికి చెందిన గజ్జల శివయ్య (43) అక్కడికక్కడ మృతి చెందారు.కొర్ర విజయలక్ష్మి కలనూతల గ్రామం పెద్దారవీడు మండలం 50 సంవత్సరాల ఇద్దరు కుమారులు భర్త నాగమయ్య నాయక్ ఎస్బిఐ చీఫ్ మేనేజర్ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భూపాల్ నగరంలో పనిచేస్తున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న మార్కాపురం సిఐ ఆవుల వెంకటేశ్వర్లు, ఎస్సై అబ్దుల్ రెహమాన్, పోలీస్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ప్రమాద సమయంలో బస్సులో చిక్కుకుపోయిన ప్రయాణికులను బయటికి తీశారు. గాయపడిన అప్సర్, మోహిత్, విజయ, హరినాథ్, రాజీవి, దస్తగిరి, డమరుకనాధ రెడ్డి లను మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. వైద్యశాలలో చికిత్స పొందిన ప్రయాణికులు వారి స్వగ్రామాలకు ప్రైవేటు వాహనాల్లో వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన



సమయంలో గుంటూరు వైపు కారులో వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాద ఘటనను చూసిన వెంటనే కారు దిగి బస్సు అద్దాలను ధ్వంసం చేసి అందులో చిక్కుకుపోయిన ప్రయాణికులను బయటికి తీయడంతో మృతుల సంఖ్య తగ్గింది. అతను సమయస్ఫూర్తిగా వ్యవహరించటంతో ఎక్కువ మంది ప్రయాణికులు మృతి చెందలేదని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు మార్కాపురం గ్రామీణ ఇన్చార్జి ఎస్ఐ అబ్దుల్ రహమాన్ తెలిపారు.

# రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

## ఏపీ రజక చైతన్యం రాష్ట్ర అధ్యక్షులు పోలిశెట్టి తిరుపతయ్య

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం మున్సిపాల్టీ, జులై 21)
రాష్ట్ర ప్రభుత్వంతో పాటు డీజీపీకి పోలీసు యంత్రాంగానికి రెండు చేతులెత్తి వేడుకుంటున్నాం, సమాజంలో ప్రజలకు సేవ చేసే నిస్సహాయకమైన రజక జాతి ఈ రోజు హత్యలకు గురికావడం చాలా బాధాకరం. ఒక బలహీనమైన కులాన్ని ఇంతగా హత్యలకు గురి చేయడం దేనికి నిదర్శనం. నేటికైనా రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి రాష్ట్రంలోని రజకుల మహిళల మానప్రాణాలతో బతకే అవకాశం కల్పించమని ఏపీ రజక చైతన్యం రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షులు పోలిశెట్టి తిరుపతయ్య, రాష్ట్ర కార్యవర్గం మార్కాపురం ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామన్నారు. గత వారం రోజుల కిందట నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రజక జాతికి చెందిన శీనుపై హత్యాయత్నం చేసి దారుణంగా దాడి హత్య చేసిన సంఘటన మరువక ముందే మరో రజక వృత్తిదారుని దారుణ హత్య చేసిన ఘటన వెలుగులోకి రావడం భయానక పరిస్థితులకు గురిచేస్తుంది. అనంతపురం జిల్లా ధర్మవరం మండలం కొత్తకోట సమీపంలో వెల్దుర్తి గ్రామానికి చెందిన చాకలి సూర్యనారాయణ అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా నరికి హత్య చేశారు. విచక్షణారహితంగా నరికి చంపారు. ఈ సంఘటన చూసిన వెంటనే ఈ జాతి ఈ సమాజంలో ఏమైపోతుందో అనే పరిస్థితులు కళ్ళకు అద్దం కట్టినట్లు కనపడుతుంది. తక్షణమే రజకులపై జరుగుతున్న దాడులు అరికట్టి, బాధ్యులైనటువంటి వారు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబెట్టి చట్ట ప్రకారం వారికి కఠినమైన శిక్ష పడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా రజకుల్లో మనోధైర్యాన్ని కల్పించేటువంటి కార్యక్రమం చేయాలని లేకుంటే రజకుల తరఫున పోరాటాలకు సిద్ధం కాక తప్పదని ఈ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చనిపోయిన రజక సోదరుడు కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రజకులపై జరుగుతున్న హత్యలను ముక్తకంఠంతో రజక జాతి ఖండిస్తున్నట్లు తెలిపారు.

# వినియోగదారుడు నష్టపోకుండా చూడటమే లక్ష్యం

## పొదిలి వినియోగదారుల రక్షణ సమితి అధ్యక్షుడు ధర్నాశి రామారావు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 21)
వినియోగదారుడు నష్టపోకుండా చూడటమే వినియోగదారుల రక్షణ సమితి లక్ష్యమని పొదిలి వినియోగదారుల రక్షణ సమితి అధ్యక్షుడు ధర్నాశి రామారావు అన్నారు. ఆదివారం పొదిలి యూనిట్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పొదిలి పట్టణంలో వివిధ రకాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సభ్యులు చర్చించారు. ప్రధానంగా డిష్ బిల్లులు ఎక్కువగా వసూలు చేస్తున్నారని, కల్తీపాలను నివారించాలని, హొటళ్లలో నాణ్యత లోపాలు ఎక్కువగా ఉన్నాయని, కలుషిత తాగునీటి సరఫరా, పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు అధికారులు కృషి చేయాల్సిన అవసరంపై సభ్యులు చర్చించారు. ఆయా సమస్యలపై ఆయాశాఖల అధికారులకు సీపీసీ తరపున ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది వినియోగదారుల రక్షణ చట్టంపై విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సభ్యులు తీర్మానించారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి జి.గౌస్బషా, కోశాధికారి రాంబాబు, సభ్యులు మహమ్మద్ జిలానిబాషా, పెద్దన్న, సీహెచ్.సుబ్బారావు, కేశవరావు, బి.వి.రెడ్డి, సుబ్బారావు, రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంటి అద్దాలు అందజేత



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 21)
సూర్య శ్రీ దివ్యంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెనాలి నేత్రాలయ ఐ కేర్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి లోపాలను గుర్తించిన 75 మంది మందికి 50 వేల విలువచేసే కంటి అద్దాలను సూర్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో నిర్వాకులు సర్దార్ భాష, ట్రస్ట్ గౌరవ సలహాదారులు మారెళ్ళ సుబ్బారావు, జనసేవ శ్రీనివాసరావు నేత్రాలయ సుభాని తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా మారెళ్ళ సుబ్బారావు సర్దార్ భాషలు మాట్లాడుతూ సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాదినిర్వహించే సేవా కార్యక్రమాలలో భాగంగా కంటివైద్య పరీక్షలు నిర్వహించి కంటి లోపాలను గుర్తించిన వారికి ఉచితంగా కళ్లద్దాలు కూడా అందజేస్తామని పేర్కొన్నారు. శుక్లాలు వచ్చిన వారికి ఉచితంగా ఆపరేషన్లు కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. నేత్రాలయ ఐ కేర్ వారికి వారు సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ధన్యవాదాలు తెలియజేశారు.

# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్ఛార్జి, జులై 21)



గురు పౌర్ణమి పర్వదినం సందర్భంగా నెహ్రూ బజార్ శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం 5 గంటలకు కాకడ హారతి, 6 గంటలకు పంచామృత అభిషేకం, 9 గంటలకు శ్రీ సాయి దాసు శ్రీశైలం గారిచే శ్రీ సాయి సత్య వ్రతం,మధ్యహ్నాం 12 గంటలకు సుమారు 25,000 మందికి అన్నదానం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా క్యూలైన్‌ల ద్వారా దర్శనం, భోజన ఏర్పాట్లు చేశారు. పోలీసు శాఖ తగిన బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు సేవలు అందించారు. అలాగే మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ పేరం సత్యనారాయణ, కోశాధికారి పీవీ ఎల్ఎన్వి నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ రామడుగు గోపి, సహాయ కార్యదర్శులు చల్లా పవన్, ఖరీమ్,కమిటీ సభ్యులు గోపాలుని కృష్ణ మోహన్, గోపి శెట్టి కొండయ్య,వేంకటేశ్వర రెడ్డి,పిచ్చి రావు, విజయ్, మధు, సాయిబాబా, రామారావు,రమణారెడ్డి, కజ్జయం సుబ్రమణ్యం, నాగేశ్వర రావు, యూత్ కమిటీ సభ్యులు మస్తాన్ రావు,శ్రీను తదితరులు,మహిళా సభ్యులు బి.భారతి, టీ.వరలక్ష్మి, ఏ.సుబ్బరత్నమ్మ, ఆర్.రమాదేవి, గౌరి ,అరుణ మహిళా సంఘ్ సభ్యులు భక్తులు పాల్గొన్నారు. గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొని జయప్రదం చేసిన అధికారులకు, పోలీసు శాఖ సిబ్బందికి, భక్తులకు ఆలయ కమిటీ కార్యదర్శి గోపాలుని హరిహరరావు కృతజ్ఞతలు తెలిపారు.



# ఇంటి కుళాయిలకు మరమ్మతులు





(షణ్ముక వెలుగు, వెలిగండ్ల, జులై 21)
వెలిగండ్ల మండలంలోని సురావారి పల్లె గ్రామంలో ఇంటి కుళాయి పైపు పగలడంతో గ్రామంలో నీళ్లు సరిగా రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు మేరకు వీధి పైపు లైన్లు దృష్టి సారించారు. తక్షణమే పగిలిపోయి ఉన్న పైపులకు వెలిగండ్ల సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు మరమ్మతులు చేయించారు. వెలిగండ్ల మాజీ సర్పంచ్ తాతపూడి మాణిక్యరావు పైపులకి మరమ్మతులు చేపించి, ఇంటింటికి నీళ్లు ఇచ్చినందుకు ప్రజలు సర్పంచ్ సురేష్ బాబుకి ధన్యవాదాలు తెలిపారు.